జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php




సంపుటి 16 సంచిక 109 విశాఖపట్నం | మంగళవారం 12 డిసెంబరు 2023 | 8 పేజీలు | వెల : 5.00




• జగనన్న బటన్ నొక్కిండు

# లా నేస్తం

## అడ్వొకేట్ల ఖాతాల్లో 8 కోట్ల రూపాయల జమ

- రెండో విడత వైఎస్ఆర్ ఊతం
- ఇప్పటికి రూ.49.51 కోట్లు ఇచ్చాం
- అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌కు రూ.100 కోట్లు కేటాయించాం
- కోవిడ్ కాలంలోనూ ఆదుకున్నాం
- ఎప్పుడూ ఈ ప్రభుత్వం మీకే తోడు
- జూనియర్ అడ్వొకేట్లకు లా నేస్తం విడుదలలో సీఎం జగన్

ఏపీ వ్యాప్తంగా ఉన్న 2,807 మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5000 చొప్పున స్టైఫండ్‌ని సీఎం జగన్ అందించారు. సోమవారం తాడేపల్లి క్యాంపు ఆఫీసులో జరిగిన కార్యక్రమంలో బటన్ నొక్కి ఫండ్స్ రిలీజ్ చేశారు. 6నెలలకు ఒక్కొక్కరికి రూ.30వేల చొప్పున మొత్తం రూ.7,98కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈరోజు దేవుడి దయతో మరోమంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, వరుసగా నాలుగు ఏళ్లుగా వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు.

(మిగతా 2లో..)

# ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీం చారిత్రాత్మకమైన తీర్పు: మోడీ హర్షం



న్యూఢిల్లీ : ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పునిచ్చింది. 370 రద్దుపై కేంద్రం తీసుకున్న నిర్ణయం సరైందేనని సుప్రీం సమర్థించింది. ఈ సందర్భంగా సుప్రీం తీర్పుపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ హర్షం వ్యక్తం చేశారు. ఆశాజనకమైన తీర్పు అని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ తీర్పుపై మోడీ 'ఒకప్పటి రాష్ట్ర (ఇప్పుడు రెండు కేంద్రపాలిత ప్రాంతా లు) ప్రజల కలలను నెరవేర్చ డానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని పోస్టులో పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీం కోర్టు నేడు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మ కమైనది. ఆగస్టు 5, 2019న భారత పార్లమెంటు తీసుకున్న నిర్ణయాన్ని రాజ్యాంగబద్ధంగా సమర్థిస్తుంది అని మోడీ అన్నారు. 'ఇది జమ్మూ కాశ్మీర్, లడఖ్ లోని మా సోదర సోదరీ మణులకు ఒక ఆశను కల్పించింది. పురోగతితో పాటు, ఐక్యతకు నిదర్శనంగా ఈ తీర్పు ఉంది. సర్వోన్నత న్యాయస్థానం అపారమైన జ్ఞానంతో భారతీయులుగా మనం ఎంతో ప్రేమించే, గౌరవించే ఐక్యత యొక్క సారంశాన్ని బలపరిచింది. ఆర్టికల్ 370 కారణంగా నష్టపోయిన మన సమాజం లోని జమ్మూకాశ్మీర్, లడఖ్ లోని ప్రజల కలల్ని నెరవేర్చడానికి మేము నిబద్ధతతో కృషి చేస్తామని నేను హామీ ఇస్తున్నాను. అత్యంత బలహీన, అట్టడుగు వర్గాలకు ప్రగతి ఫలాలు అందేలా చూస్తాము. ఈరోజు తీర్పు కేవలం చట్టపరమైన తీర్పు కాదు. ఇది ఒక ఆశాకిరణం. ఉజ్వల భవిష్యత్తు యొక్క వాగ్ధానం. బలమైన, మరింత ఐక్యమైన భారతదేశాన్ని నిర్మించాలనే మా సమిష్టి సంకల్పానికి నిదర్శనం.' అని మోడీ తన పోస్టులో పేర్కొన్నారు.

# యువతకు ఉపాధి కల్పన

## అన్‌ఎంప్లాయిమెంట్ హటావో నినాదంతో... ఆల్ తెలుగు ప్రజాపార్టీ



విజయవాడ (ప్రజాపాలన ప్రతినిధి ): నిరుద్యోగానికి ముగింపు పలకడానికి యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి అద్భుతమైన పథకాలను ఆల్ తెలుగు ప్రజాపార్టీ మేనిఫెస్టోలో రూపొందించిందని ఆల్ తెలుగు ప్రజాపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కటికల శివ భాగ్యారావు తెలిపారు. ఈ సందర్భంగా మేనిఫెస్టోలో అన్‌ఎంప్లాయిమెంట్ హటావో పేరుతో రూపొందించిన పథకాల వివరాలు వివరించారు .తమ పార్టీ అధికారంలోకి రావడంతోనే ప్రతి యువకునికి విద్యానంతరము ఉద్యోగం వచ్చేవరకు ఫుడ్ ,షెల్టర్ మరియు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఉచితంగా ఇస్తామని,స్మాల్, మీడియం స్కేల్ వ్యాపారాలకు తోడ్పాటు అందిస్తామని, యువతకు ఉపాధి అవకాశాలు పెంచడానికి ప్రతి జిల్లాలో 100 ఎకరాలలో నిరుద్యోగ హటావో భవనాలను నిర్మించి ప్రతి ఒక్క నిరుద్యోగ యువకుడికి స్కిల్ డెవలప్మెంట్ పెంచడానికి కృషి చేస్తామన్నారు. గ్రాడ్యుయేషన్ నుండి పీహెచ్డీ చేసిన నిరుద్యోగుల వరకు ఈ సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకొని వారికి కావలసిన విధంగా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉపాధి కల్పిస్తామని వారి వారి అభిరుచి మేరకు వారు కోరుకున్న విధంగా శిక్షణ ఇచ్చి తదనుగుణంగా ఆయా విభాగాలలో వారు చేరే విధముగా చేయటం, వారికి ఐదు నుండి పది లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తామని ఆయన అన్నారు.

# మంగళగిరి వైసీపీ నేతలతో జగన్ భేటీ



తాడేపల్లి : మంగళగిరి ఎమ్మెల్యే పదవికి ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రాజీనామా చేశారు. ఇవాళ ఏపీ అసెంబ్లీ స్పీకర్ కార్యాలయానికి వెళ్లిన ఆయన తన రాజీనామా లేఖను సమర్పించారు. వ్యక్తిగత కారణాలతోనే ఆయన తన ఎమ్మెల్యే పదవికి, వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన స్పష్టత ఇచ్చారు. ఆళ్ల రాజీనామాతో వేగంగా మంగళగిరి నియోజకవర్గ రాజకీయాలు మారుతున్నాయి. మంగళగిరి పంచాయతీ తాడేపల్లికి చేరింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి రాజీనామాతో వైసీపీ హైకమాండ్ అలెర్ట్ అయింది. సీఎంఓ పిలుపుతో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గంజి చిరంజీవి క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో బీసీ నేత గంజి చిరంజీవికి మంగళగిరి నియోజకవర్గ బాధ్యతలు ఇస్తారని విస్తృతంగా జరుగుతున్న ప్రచారం జరుగుతోంది. అందుకే గంజి చిరంజీవికి క్యాంపు కార్యాలయం నుంచి పిలుపు వచ్చినట్లు పార్టీ వర్గాల్ల ప్రచారం జరుగుతోంది. తాజా పరిణామాలపై సీఎం జగన్‌తో నేతలు భేటీ భేటీ అయ్యారు.

# మధ్యప్రదేశ్ సీఎంగా మోహన్ యాదవ్..

## బీజేపీ హైకమాండ్ సంచలన నిర్ణయం



మధ్యప్రదేశ్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంపికలో బీజేపీ హైకమాండ్ సంచలన నిర్ణయం తీసుకుంది. సీఎం రేసులో ఉన్న సీనియర్ నాయకులు అందరినీ పక్కన పెట్టి.. అసలు రేసులోనే లేని మోహన్‌యాదవ్‌కు సీఎం పదవి కట్టబెట్టింది. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం మధ్యప్రదేశ్ బీజేపీ శాసనసభా పక్షం సమావేశమై తమ నాయకుడిగా మోహన్ యాదవ్‌ను ఎన్నుకున్నది. దాంతో గత 8 రోజుల మధ్యప్రదేశ్ సీఎం ఎంపికపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది.కాగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంపిక కోసం అంతకుముందు బీజేపీ హైకమాండ్ హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, తెలంగాణకు చెందిన బీజేపీ జాతీయ నాయకుడు డాక్టర్ కే లక్ష్మణ్, ఆశా లక్రాలతో కేంద్ర పరిశీలకులుగా నియమించింది. ఈ పరిశీల సమక్షంలోనే కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు తమ నాయకుడిగా మోహన్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


# విశాఖలో జనసేన ధర్నా..

## నాదెండ్ల మనోహర్ అరెస్ట్




విశాఖపట్నం: టైకూన్ కూడలిలో రోడ్డు మూసివేతను నిరసిస్తూ మనోహర్ నేతృత్వంలో జనసేన ధర్నాచేపట్టింది. ఈ సందర్భంగా ఈ ధర్నాలో పాల్గొన్న జనసేన రాజకీయా వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ను వైజాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు ఇతర జనసేన నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో అక్కడి నుంచి తరలించారు.అరెస్ట్ అయిన నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రియలెస్టేట్ వ్యాపారంలో భాగంగా నిర్మిస్తున్న కట్టడానికి వాస్తు బాగోలేదని రోడ్డును మూసేశారని ఈ సందర్భంగా మనోహర్ మండిపడ్డారు. వైసీపీ నేతల నిర్మాణాలకు వాస్తు దోషం ఉంటే రోడ్లను మూసేస్తారా? అని ప్రశ్నించారు. తమ ధర్నా రాజకీయ కార్యక్రమం కాదని. శాంతియుతంగా చేస్తున్న నిరసన కార్యక్రమమని మనోహర్ చెప్పారు.తమ ధర్నా కార్యక్రమం గురించి తెలిసి నిన్నటి నుంచి పోలీసులు పలు విధాలుగా తమను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. తమ వాళ్లను ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్ చేశారని అన్నారు. వైసీపీ నేతల ట్రాప్ లో పోలీసు అధికారులు పడొద్దని సూచించారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేదని విమర్శించారు.

# 'పవర్'ఫుల్ మేనిఫెస్టో.. రెండు కొత్త హామీల దిశగా టీడీపీ - జనసేన



అమరావతి, : ఎన్నికల్లో అత్యంత కీలకమైంది ఎన్నికల మేనిఫెస్టో. ప్రతి పార్టీ నిర్ధిష్టమైన హామీలతో ఎన్నికల కోసం ప్రజల ముందుకు వెళ్లడం, దీనికోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించే ఈ మేనిఫెస్టోను పవర్ ఫుల్‌గా రూపొందించేందుకు టీడీపీ – జనసేన పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఆయా పార్టీల మేనిఫెస్టోలు ఫలించి అధికారాన్ని కట్టబెట్టాయి. ఇప్పుడు రాష్ట్రంలో కూడా త్వరలో ఎన్నికల గంట మోగనున్న నేపథ్యంలో టీడీపీ – జనసేనలు మరింత పవర్‌ఫుల్ హామీలతో ప్రజల ముందుకు వెళ్లే ప్రయత్నాలను మొదలుపెట్టాయి. ఇప్పటికే 11 ప్రధాన అంశాలతో ఉమ్మడి మినీ మేనిఫెస్టోను విడుదల చేసిన ఆ రెండు పార్టీలు త్వరలో పూర్తిస్థాయి మేనిఫెస్టోను విడుదల చేయనున్నాయి. (మిగతా 2లో..)



# 'పవర్'ఫుల్ మేనిఫెస్టో.. రెండు కొత్త హామీల దిశగా టీడీపీ - జనసేన

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో రెండు కొత్త హామీలతో ప్రజలను ఆకర్షించే దిశగా అడుగులు వేస్తున్నాయి.ప్రధానంగా రాష్ట్రంలో విద్యుత్ అంశాన్ని ప్రమాణికంగా తీసుకున్న ఈ రెండు పార్టీలు పేదలకు ఉచిత గృహ విద్యుత్ అందించాలన్న యోచనలో ఉన్నాయి. విద్యుత్ రంగంలో తనకున్న అనుభవాన్ని టీడీపీ ఒక వరంగా మార్చుకునేందుకు సిద్ధమవుతోంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ హామీ ఇప్పటికే అమలులో ఉన్న నేపథ్యంలో గృహ వినియోగానికి దీనిని వర్తింపచేయాలని యోచిస్తోంది.కర్ణాటక తరహాలో ఆ అస్త్రాన్ని ఏపీలో కూడా సంధించాలని టీడీపీ - జనసేన పార్టీలు నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. తెల్ల రేషన్ కార్డ్ కలిగిన పేదలు, ముఖ్యంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఒక వరాన్ని ప్రకటించాలని భావిస్తున్నాయి. ప్రస్తుతం విద్యుత్ బిల్లులు మోతమోగుతున్న పరిస్థితుల్లో ఈ అస్త్రం తమ పార్టీలకు ఎంతగానో లబ్ధి చేకూరుస్తుందోనన్న భావనలో ఆ పార్టీలు ఉన్నాయి.ఈ ఉచిత గృహ విద్యుత్ హామీని గతంలో ప్రకటించిన పథకాల కు సంబంధించిన హామీలతో కలిపి మరోసారి మేనిఫెస్టో ద్వారా ప్రజలలోకి తీసుకువెళ్లాలని నిర్ణయించాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో మరోసారి చర్చించిన అనంతరం చంద్రబాబు దీనిపై ఒక నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది. విభజన అనంతరం రాష్ట్ర విద్యుత్ రంగం పూర్తిగా సంక్షోభంలో ఉన్న పరిస్థితి ప్రతి ఒక్కరికి తెలిసిందే.అత్యధిక విద్యుత్ లోటుతో ఉన్న సమయంలో అధికార పీఠాన్ని అధిరోహించిన చంద్రబాబు విద్యుత్ రంగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడంతో పాటు అనేక సంస్కరణలు తీసుకువచ్చి మెరుగైన ఫలితాలు సాధించారు. లోటు నుంచి మిగులు విద్యుత్ దశకు రాష్ట్రం చేరుకోవడమే కాకుండా పొరుగు రాష్ట్రాలకు విక్రయించే స్థాయికి ఎదిగింది. అయితే ఆ తర్వాత టీడీపీ అధికారాన్ని కోల్పోయింది.అప్పటి వరకు ఉన్న విద్యుత్ వెలుగులు కాస్త మసకబారుతూ వస్తున్న పరిస్థితి నెలకొంది. పొరుగు రాష్ట్రాల నుంచి ఇప్పుడు విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రావడాన్ని ఇప్పటికే టీడీపీ %--% జనసేనలు అస్త్రంగా చేసుకుని ప్రభుత్వంపై పలు సందర్భాల్లో విరుచుకుపడ్డాయి. మరోవైపు విద్యుత్ వినియోగదారులకు బిల్లుల భారం అంశాన్ని ప్రతి సభలో చంద్రబాబు ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ఎండగడుతున్నారు.ఇదే సమయంలో తాము అధికారంలోకి వచ్చాక మరోసారి విద్యుత్ వ్యవస్థను పటిష్టం చేసి ఉన్న ఛార్జీలను కూడా తగ్గిస్తామని హామీనిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గృహ వినియోగదారులకు ఈ వరాన్ని ఇవ్వాలన్న నిర్ణయానికి టీడీపీ అధినేత వచ్చినట్లుగా సమాచారం.

రైతు రుణమాఫీ దిశగా ఆలోచన..!

కర్ణాటక, తెలంగాణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ఎంతగానో ఉపయోగపడ్డ మేనిఫెస్టో హామీలను గుర్తించిన టీడీపీ, జనసేన వాటికి అదనంగా మరింత పవర్‌ఫుల్‌గా మేనిఫెస్టో ఉండేలా కార్యచరణను రూపొందిస్తున్నాయి. ఈ మేనిఫెస్టోలో ప్రధానంగా రెండు కీలక అంశాలలో ప్రజలకు, రైతులకు స్పష్టమైన హామీలు ఇవ్వాలని యోచిస్తున్నాయి.ప్రస్తుతం రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న కష్టాలను స్వయంగా తెలుసుకుంటున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఆ వర్గానికి బాసటగా నిలవాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధానంగా రైతు రుణమాఫీ హామీని ఇవ్వాలన్న నిర్ణయానికి దాదాపుగా వచ్చాయి. ఇంకోవైపు ఉద్యాన రైతులకు ఇప్పటికే హామీని జనసేన ఇచ్చింది. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు అంశాన్ని స్పష్టం చేసింది.ఈ నేపథ్యంలో టీడీపీ కూడా గతంలో మాదిరిగానే లక్ష రూపాయల రుణమాఫీతో రైతులను ఆదుకోవాలని భావిస్తుంది. ఈ హామీని ఉమ్మడి మేనిఫెస్టోలో చేర్చేందుకు దాదాపుగా రంగం సిద్ధమయ్యింది. అసలు రుణమాఫీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఏ మేరకు చేయాల్సి ఉంటుందో, అందుకు తగ్గ ఆర్థిక వనరుల సమీకరణ , తదితర అంశాలపై చంద్రబాబు ఫోకస్ పెట్టారు. ఇక రైతులకు చేసే ఈ మాఫీ ఏ విధంగా ఇవ్వాలి..? తదితర అంశాలపై మేనిఫెస్టో కమిటీతో చర్చించినట్లుగా తెలుస్తోంది.

హామీలపై చంద్రబాబు, పవన్‌ల ష్యూరిటీ..

ఉమ్మడి మేనిఫెస్టోలో ఇచ్చే హామీలన్నీ పూర్తిస్థాయిలో నెరవేరుస్తామని టీడీపీ - జనసేనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే గతంలో టీడీపీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక నెరవేర్చలేదన్న విమర్శలు, ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఇప్పుడు ఆ అపవాదును తొలిగించుకునేందుకు చంద్రబాబు నిర్ణయించుకున్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలను ప్రకటించిన ఆయన బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ పేరిట ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు.అయితే ఆ తర్వాత జనసేనతో పొత్తు ఖరారు కావడం ఆ వెంటనే రెండు పార్టీలు కలిసి 11 అంశాలతో మినీ మేనిఫెస్టోను ప్రకటించిన విషయం తెలిసిందే.

## జనసేనపార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో కాపు సేవా ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం



చీరాల, డిసెంబర్ 11, ప్రజాపాలన : జనసేన పార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో, కొనసాగుతున్న కాపు సేవా ట్రస్ట్ సామాజిక సేవలు ప్రశంసనీయమని, నేటి యువతకు స్ఫూర్తిదాయకమని, తెలుగుదేశం పార్టీ చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను, ఉమ్మడి ప్రకాశం జిల్లా చేనేత వికాస విభాగ జిల్లా అధ్యక్షులు కర్ణకిరణ్ తేజ లు అన్నారు. స్వర్గీయ రావూరి వెంకటసుబ్బయ్య, మీనాక్షమ్మ ల జ్ఞాపకార్థం, చీరాల కాపు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో, శ్రీమతి డొక్కా సీతమ్మ, పవన్ కళ్యాణ్ ల స్ఫూర్తి తో, నిరంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలలో భాగంగా, సోమవారం పేరాల చిన్నరథం సెంటర్ లో, నిర్వహించిన అల్పాహారవిందు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు రావూరి వెంకటేశ్వర్లు,కోటేశ్వరమ్మల నిర్వహణలో, జనసేన పార్టీ నేత రావూరి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన, జన సైనికుల సమిష్టి కృషి తో,భవన నిర్మాణ కార్మికులకు, ప్రజలకు ఏర్పాటు చేసిన అల్పాహార విందు కార్యక్రమం విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో హాజరైన భవన నిర్మాణ కార్మికులకు, ఎటువంటి ఇబ్బందులు లేకుండా, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. కాపు సేవా ట్రస్ట్ సేవలను ప్రశంసిస్తూ, ట్రస్ట్ నిర్వాహకులను, జన సైనికులను, ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేత రావూరి బాలాజీ, తెలుగుదేశం పార్టీ చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను, ఉమ్మడి ప్రకాశం జిల్లా చేనేత వికాస విభాగ జిల్లా అధ్యక్షులు కర్ణకిరణ్ తేజ, ఉమ్మడి ప్రకాశం జిల్లా చేనేత వికాస విభాగ జిల్లా ఉపాధ్యక్షులు బూడిద వరం, ముస్లిం మైనారిటీ జనసేన యువనేత షేక్ ఉరుం భాషా, రంగినేని అనిల్, నీలపు కోటేష్, అల్లన దుర్గ, పట్నాన రాంబాబు, బాసి పైడయ్య, క్రోవి వెంకట సుబ్బమ్మ, చిచ్చుల పద్మ, చిచ్చుల మణి, చిచ్చుల సుబ్బయ్య, వీర మహిళలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## చీరాల ఎన్.ఆర్.అండ్ పి.ఎం.హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ కు బెస్ట్ సర్వీస్ అవార్డు

**- అసోసియేషన్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డు**

**- అసోసియేషన్ ప్రతినిధులకు ఘన సన్మానం**




చీరాల, డిసెంబర్ 11, ప్రజాపాలన : ఎన్.ఆర్.అండ్ పి.ఎం.హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ చేస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమ ని,వారి సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా, బెస్ట్ సర్వీస్ అవార్డు, జ్ఞాపిక అందజేయటం ఆనందంగా ఉందని, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ ఎం.వెంకటాద్రి రెడ్డి అన్నారు. నెల్లూరు రోటరీ ఆడిటోరియంలో, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ ఎం.వెంకటాద్రి రెడ్డి ఆధ్వర్యంలో, డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్, అవార్డ్స్ ఫంక్షన్ అంగరంగ వైభవంగా జరిగింది.అందులో చీరాల ఎన్.ఆర్.అండ్ పి.ఎం.హైస్కూల్ వాక ర్స్ అసోసియేషన్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా, బెస్ట్ సర్వీస్ అవార్డు, జ్ఞాపికను అందజేసి, అసోసియేషన్ ప్రతినిధులను అభినందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, నారాయ ణ మూర్తి, వంగర పూర్ణచంద్రరావు, చింతా రమేష్, రవి, సుబ్బారావు, సాంబశివరావు, తిరుపతిరావు, చెంగలరాయుడు, రామారావు, మాజీ గవర్నర్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 300మంది ఆయాప్రాంతాల వాకింగ్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్‌లో ప్రారంభమైన అటల్ ఫ్యాకల్టి డెవలప్మెంట్ ప్రోగ్రామ్




చీరాల, డిసెంబర్ 11, ప్రజాపాలన : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, ఎ.ఐ.సి.టి.ఇ. వారి సహకారంతో డిసెంబర్ 11 నుండి 16వరకు అధ్యాపకులకు, ఫ్యాకల్టి డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించినట్లు, కళాశాల కరస్పాండెంట్ యస్.లక్ష్మణరావు తెలిపారు.ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారి సహకారంతో, డిసెంబర్ 11 నుండి 16 వరకు, అధ్యాపకులకు ఎలక్ట్రిల్ అం డ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం(ఇ.ఇ.ఇ)వారి ఆధ్వర్యంలో, ఫ్యాకల్టి డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ను ప్రారంభించినట్లు కళాశాల ప్రధానోధ్యా పకులు డాక్టర్ మొయిద వేణుగోపాలరావు తెలిపారు.పవర్ కన్వర్టర్స్ అండ్ కంట్రోల్ టెక్నిక్స్ ఇన్ మైక్రో గ్రిడ్స్ అండ్ ఎలక్ట్రికల్ వెహికల్స్ పై, ఫ్యాకల్టి డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు, ఇ.ఇ.ఇ విభాగాధిపతి, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ యస్.వి.డి.అనిల్ కుమార్ తెలిపా రు. మొదటి రోజు ఏపీ యస్.ఆర్.యమ్.యూనివర్సిటి నుండి డాక్టర్ సత్యవీర్ సింగ్ పాల్గొని, మ్యాథమాటిక్స్ మోడలింగ్ అఫ్ మైక్రో గ్రిడ్స్ గురించి అధ్యాపకులకు అవగాహన కల్పించారు.సాయంత్రం విజయవాడ పి.వి.పి.సిద్దార్థ ఇంజనీరింగ్‌కళాశాల నుంచి డాక్టర్.యమ్.వి. రమే ష్ పాల్గొని, యన్ ఒవర్ వ్యూ ఆఫ్ ఎలక్ట్రికల్ వెహికల్స్ పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ తులసి నరసింహ ప్రసాద్ కన్వీ నర్ గా వ్యవహరిస్తున్నారు.

## శివయ్య సేవలో గుండా శివ దంపతులు



గోకవరం : మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకటలాడాయి. కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని శైవ క్షేత్రాలలో భక్తులు తెల్లవారుజాము నుంచే పూజలు,అభిషేకాలు జరిపించినారు. గోకవరంలోని శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి కి గుండా శివప్రసాద్ దంపతులు 30 కేజీల అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి ప్రసాదంను నైవేద్యంగా సమర్పించడం జరిగింది. తదుపరి శివయ్య భక్తులకు ప్రసాదంను వితరణ చేయడం జరిగింది.

## సిఐ ఫిరోజ్ సామాజిక సేవా దృక్పథం ప్రశంసనీయం: వక్ఫ్‌బోర్డ్ బాపట్ల జిల్లా సెక్రటరీ గడ్డం మస్తాన్ వలి

**వెంకయ్య ఆశ్రమంలో సీ.ఐ.ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం,దుప్పట్లపంపిణీ.**



మార్టూరు(పర్చూరు), డిసెంబర్ 11, ప్రజాపాలన : సిఐ ఫిరోజ్ సామాజిక సేవా దృక్పథం ప్రశంసనీయమని, వక్ఫ బోర్డ్ బాపట్ల జిల్లా సెక్రటరీ గడ్డం మస్తాన్‌వలి అన్నారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని,మార్టూరు విజయనగర్ కాలనీలోని, వెంకయ్య సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆశ్రమంలో, చీరాలకు చెందిన కలిగిరి సీఐ మహమ్మద్ ఫిరోజ్ పుట్టినరోజు సందర్భంగా, సీఐ ఫిరోజ్ సతీమణి జరీనా, కుటుంబ సభ్యులతో కలిసి, ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, అనంతరం అన్నదానం చేశారు.కార్యక్రమంలో బాపట్ల జిల్లా వక్ఫ బోర్డ్ సెక్రటరీ గడ్డం మస్తా న్ వలి, మార్టూరు పంచాయతీ సెక్రటరీ తన్నీరు.శ్రీనివాసరావు, సచివాలయం సెక్రెటరీ మీరావలి, హోంగార్డ్ నాగూర్, ఎంపీటీసీ కరీముల్లా, జానీ భాషా, రఫీ, కరీంభాషా, ఆశ్రమ నిర్వాహకుడు తన్నీరు శివ రాజేష్ పాల్గొన్నారు. ఆశ్రమం నిర్వాహకుడు తన్నీరు శివ రాజేష్ దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్టిఐ కమిషనర్ కు ఆత్మీయ పూర్వక ఘన సన్మానం



వేటపాలెం, డిసెంబర్ 11, ప్రజాపాలన : ఆర్టిఐ కమిషనర్ శ్యామ్యూల్ జోనాథన్‌ను, తెలుగుదేశం పార్టీ యువనేత పొగడదండ రవికుమార్ అత్యంత ఘనంగా సన్మానించారు. సమాచారహక్కు చట్టం సక్రమంగా అమలు అయ్యేలా, ఆర్టిఐ కమిషనర్ గా శ్యామ్యూల్ జోనాథన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.ఈ సందర్భంగా ఆర్టిఐ కమిషనర్ జోనాథన్ మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఎటువంటి సమాచా రాన్నయినా అడిగే హక్కు, పౌరునిగా ప్రతి ఒక్కరికి ఉందని, ఆర్.టి.ఐ.చట్టం పౌరుని చేతిలో బ్రహ్మాస్త్రమని,ఆర్టిఐ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# లాయర్లకు లా నేస్తం

**జూనియర్ అడ్వోకేట్లకు లా నేస్తం విడుదలలో సీఎం జగన్**

ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా 2,807 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5000స్టయిఫండ్ చొప్పున జూలై-డిసెంబర్ 2023.. 6నెలలకు ఒక్కొక్కరికి రూ.30,000లు చొప్పున మొత్తం రూ.7,98కోట్లు జమ. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం బటన్ నొక్కి యువ న్యాయ వాదుల ఖాతాల్లో సీఎం వైస్.జగన్ మోహన్ రెడ్డి జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రోజు దేవుడి దయతో మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, వరుసగా గత నాలుగు ఏళ్లుగా వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. న్యాయవాద విద్యను పూర్తి చేసుకుని తమ వృత్తిలో తాము నిలబడే సమయంలో ప్రోత్స హించాలని, లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన జూనియర్ అడ్వోకేట్లందరికీ నెలకు రూ.5వేలు స్టయిఫండ్ చొప్పున,ఏడాదికి రూ.60 వేలు, మూడేళ్లకు రూ.1.80 లక్షలు ఇస్తూ.. ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడేందుకు తోడుగా ఈ మంచి కార్యక్రమం జరుగుతుందని సీఎం జగన్ వివరించారు. ఈ ఏడాది రెండో విడతలో 2,807 మంది అడ్వొకేట్ చెల్లెమ్మలు, తమ్ముళ్లకు మంచి చేస్తూ...దాదాపు 8 కోట్లు బటన్ నొక్కి ఒక్కొక్కరికి 30 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేశామని, ఈ నాలుగేళ్లలో మొత్తంగా వైఎస్సార్ లా నేస్తంతో 6,069 మంది జూనియర్ అడ్వొకేట్లకు రూ.49.51 కోట్లు జమ చేశామన్నారు. అడ్వొకేట్లందరూ బాగుండాలని, మంచి జరగా లని తపిస్తూ వైఎస్సార్ లా నేస్తమే కాకుండా రూ.100 కోట్లతో అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్టును స్థాపించామని వివరించారు. అడ్వొకేట్ జనరల్ ఆధ్వర్యంలో,లా సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ ఇద్దరినీ సభ్యులుగా నియమించి రూ.100 కోట్లు కేటాయించామని వివరించారు. ఆ కేటాయింపుతో కోవిడ్ సమయంలో వీళ్లందరికీ చాలా మంచి జరిగిందని, వీరిలో 643అడ్వొకేట్ కుటుంబాలకు రూ.52 లక్షలుఇచ్చామని, ఆ సమయంలో ఇబ్బందుల్లోని 7,733 మందికి అడ్వొకేట్లకు రూ.11.56 కోట్లు రుణాలు ఇచ్చామని, మరో 14,848 మంది అడ్వొకేట్లకు మెడిక్లెయిమ్ పాలసీ కింద రూ.11.41 కోట్లు చెల్లించామని, అదే సమయంలో ఈ ఫండ్ నుంచి అడ్వొకేట్ కమ్యూనిటీకి రూ.25 కోట్లు ఇచ్చి.. తోడుగా నిలబడినట్టు సీఎం జగన్ తెలిపారు.

## అభివృద్ధి సంక్షేమంలో వైకాపా ముందంజ.



గోకవరం ప్రజా పాలన డిసెంబర్ 11: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమల్లో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ముందంజలో ఉందని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెం గ్రామంలో సోమవారం వైఎస్ఆర్సిపి పతకాన్ని ఎగిరివేయడంతోపాటు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన అభివృద్ధి కార్యక్రమాలపై డిజిటల్ సైన్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయ లేని వంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం తిరుమలాయపాలెం గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి రోడ్డు పనులను పరిశీలించారు. ఆ తరువాత తంటికొండలోని జంబుకేశ్వర స్వామి ఆలయం , గోకవరంలోని శివాలయంవెళ్లి ఆలయంలోని శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణుని పాలెం గ్రామంలో గోశాల వద్ద ఏర్పాటుచేసిన అన్న సమరాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్, మండల కన్వీనర్ పాటి రాంబాబు, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, నరాల శెట్టి నరసయ్య, దాకారపు దుర్గాప్రసాద్, అంబటి ప్రసన్న, ఎంపీడీవో కె పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# డిజైన్‌స్లేట్ పరిశ్రమను ఆదుకోవాలి

**సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు**



మార్కాపురం రూరల్ (ప్రకాశం జిల్లా) : డిజైన్ స్లేట్ పరిశ్రమను వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా పారిశ్రామికవాడలోని పలకల పరిశ్రమ, క్వారీలను సిఐటియు బందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ డిజైన్ స్లేట్ పరిశ్రమపై రాయల్టీ, లైసెన్స్ అనే పేరుతో భారీగా పన్నులు విధించడంతో పరిశ్రమ పూర్తిగా అంతరించిపోయే విధంగా ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. వెంటనే పలకల పరిశ్రమ పునరుద్ధరణ కోసం తగు చర్యలు తీసుకొని పరిశ్రమలను ఆదుకోవాలని కోరారు. కరువు వెనుకబడిన ప్రాంతంగా ఉన్న మార్కాపురం ప్రాంతంలో ఉపాధినిస్తున్న అతి పెద్ద పరిశ్రమ డిజైన్ స్లేట్ అని తెలిపారు. నాడు పరిశ్రమలో పది వేల మంది కార్మికులతో నిత్యం పని జరుగుతూ ఉండేదని, నేడు వెయ్యి మంది లోపు మాత్రమే పనిచేస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితికి ప్రభుత్వమే కారణమని అన్నారు. ప్రభుత్వం వెంటనే పరిశ్రమపై భారీ మొత్తంగా విధిస్తున్న పన్నులు తగ్గించాలని, రాయితీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ కట్టడాలకు డిజైన్ స్లేట్ వాడే విధంగా నిర్ణయం తీసుకోవాలని, కార్మికులకు ఉపాధి పెంచే మార్గాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, అధ్యక్ష, కార్యదర్శులు కె సుబ్బరాయుడు, పి రూబెన్, డిజైన్ స్లేట్ యూనియన్ అధ్యక్షులు బాలశేషయ్య, వెంకటరెడ్డి, ప్రకాశం, రాములు పాల్గొన్నారు.

# నోట్ల కట్టలు లెక్కపెట్టడానికి 40 మంది

న్యూఢిల్లీ, డిసెంబర్ 11, :డబ్బులను లెక్కించడానికి కొన్ని గంటలు కాదని.. చాలా రోజులు పడుతుందని అంటున్నారు. ఇంకా డబ్బు చాలా ఉంది, దొరికిన డబ్బులను ఉంచడానికి ఒకటి కాదు, చాలా అరలు అవసరం అయ్యాయి. దీని తరువాత కూడా, మిగిలిన డబ్బు చాలా సంచులలో నింపారు. జార్ఖండ్ కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో ఇన్‌కమ్ ట్యాక్స్ సోదాల్లో దొరికిన నల్లధనం పరిస్థితి ఇది. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో రూ.290 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ డేటా ఇంకా పూర్తి కాలేదు. విచారణ ఇంకా కొనసాగుతోంది. 7 గదులు, 9 లాకర్లు తెరవాల్సి ఉంది.డబ్బులను లెక్కించేందుకు 40-50 మందితో కూడిన బృందాన్ని నియమించారు. అంతేకాకుండా 40 చిన్న, పెద్ద నోట్ల లెక్కింపు యంత్రాలను ఏర్పాటు చేశారు. స్వాధీనం చేసుకున్న డబ్బును ఒడిశాలోని ఎస్‌బీఐ బలంగీర్ బ్రాంచ్‌కు తీసుకొచ్చారు. ఈ డబ్బును మొత్తం 176 బస్తాల్లో తీసుకొచ్చారు. డబ్బుల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది. భారతీయ చరిత్రలో ఏ ఏజెన్సీ నిర్వహించని అతిపెద్ద రికవరీగా ఇది పరిగణించబడుతుంది.కాంగ్రెస్ ఎంపీ సాహు కి చెందిన పలుచోట్ల దాడులు నిర్వహిస్తున్నారు. పట్టుబడిన నగదులో అత్యధికంగా రూ.500 నోటు ఉన్నట్లు సమాచారం. ధీరజ్ సాహు ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో ఆదాయపు పన్ను (ఐటీ) విభాగం బృందం మూడు సూట్‌కేస్‌లను తీసుకొచ్చింది. ఈ సూట్ కేసుల్లో ఆభరణాలు కూడా ఉన్నాయని భావిస్తున్నారు. అయితే ఈ విషయం ఇంకా ధృవీకరించాల్సి ఉందితమ ఎంపీ సాహు కి చెందిన ఆస్తులపై ఐటీ దాడులు భారీగా పట్టుబడిన నగదుపై ఇప్పటి వరకూ కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడలేదు. దీంతో సాహు విషయంలో కాంగ్రెస్ దూరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఎంపీ ధీరజ్ సాహు వ్యాపారంతో కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ ఎక్స్ (గతంలో ట్విట్టర్)లో రాశారు. దాడుల్లో ఇంత భారీ మొత్తంలో నగదు ఎలా రికవరీ అయ్యిందనే దానిపై సాహు వివరణ ఇవ్వాలని కూడా పేర్కొన్నారు.ఎంపీ ధీరజ్ సాహు వ్యాపారంతో జాతీయ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని. ఆదాయపు పన్ను శాఖ అధికారులు సాహు ఉన్న ప్రాంతాల నుంచి ఇంత భారీ మొత్తంలో నగదు ఎలా రికవరీ చేస్తుందో అతను మాత్రమే వివరించగలడు.. వివరించాలని పేర్కొన్నారు.అదే సమయంలో ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ ప్రధాని మోడీతో సహా పలువురు సీనియర్ బిజెపి నాయకులు అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ధీరజ్ సాహు కుటుంబం మద్యంతో పాటు హోటల్, రియల్ ఎస్టేట్, రవాణా ,చేపల వేట వంటి అనేక ఇతర వ్యాపారాలు చేస్తుందని తెలుస్తుంది. అయితే నగదు స్వాధీనంపై ఎంపీ ధీరజ్ సాహు నుంచి ఇంకా ఎలాంటి స్పందన లేదు.

# మంగళగిరి వైసీపీలో ముసలం.. రాజీనామాల పర్వం..



మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరిలోని వైసీపీ పార్టీలో ముసలం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే ఆర్కే రాజీనామాతో తాడేపల్లిలో పదవులకు రాజీనామాల పర్వం కొనసాగుతోంది. మంగళగిరి పట్టణ వైసీపీ అధ్యక్షులు ఆకురాతి రాజేష్ రాజీనామా చేశారు. అలాగే వైసీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరావు రాజీనామా చేయగా, మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ సంకే సునీత రాజీనామా చేశారు. అదేవిధంగా మంగళగిరి సోషల్ మీడియా కన్వీనర్ షేక్ గౌస్, మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలు గోలి కస్తూరి, మంగళగిరి రూరల్ మండలం %జీజూ% కన్వీనర్ అన్నపురెడ్డి బ్రహ్మర్గన రెడ్డి, వైసీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ మల్లవరపు సుధారాణి, మంగళగిరి మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూప రాణి, నియోజకవర్గ నాయకులు కలకోటి బోయోజు, ఆత్మకూరు వైసీపీ నాయకులు పులివర్తి రాంబాబులు వైసీపీకి రాజీనామా చేశారు.


# సినిమాల్లో మితిమీరుతున్న హింస

కొత్తగా వస్తున్న చిత్రాలలో హింసను మరో కొత్త పుంతలు త్రొక్కిస్తున్నారు. స్కంధ అనే చిత్రంలో దాదాపు అరవై శాతం నరుక్కోవటాలే... ఒక్కడు? ఓ ప్రత్యేకమైన కత్తితో వరుసగా పది, వంద, వేయి తలలు నరికటమే. శవాలను గాలిలోకి లేపటమే.. హీరో కండబలం, గుండెబలం చూపటానికి హింస ఒక కొలమానమై పోయింది. ఆ మధ్య ఓ చిత్రంలో కథానాయకుడు వేగంగా వస్తున్న రైలును తన చూపుడు వ్రేళ్ళును చూపి భయ పెడతాడు. అంతే రైలు కీచుమనే శబ్దంతో ఆగిపోతుంది.. మరో చిత్రంలో 'షేర్ ఖాన్? వంద, వేయి,? పెంచుకుంటూ పోయి మనుషులను పంపు నా కత్తికి ఎరవేస్తా? బొబ్బలు పెట్టిన హీరో అలానే చేస్తాడు. వచ్చిన వారంతా తమ తలకాయలను ఆయనకిచ్చేసి అలా, అలా ప్రక్కనున్న నదిలో పడిపోతారు? అంత హింస కు కారణం.. అతని ప్రేయసి.ఉ ద్యమాల్లో హింస ప్రధాన భాగమయింది. హింస గురించి సాహితీపరమైన, సామాజిక అవసరమైన చర్చ ఎందుకంటే సాహిత్యం కన్నా దృశ్యం వ్యక్తిని త్వరగా ప్రభావితం చేస్తుందనేది సత్యం. రామాయణం చదివి ఎవరూ రాముడు సీతలా కాలేదు. భారతం చదివి కుటుంబ పోరులు, హరిశ్చంద్రుని కథ చదివి ఎవరూ మారలేదు' అని చాలా ఏళ్ల క్రితం ప్రముఖ నటుడు సభాముఖంగానే చెప్పాడు. కానీ యోగి వేమన సినిమా చూసి ఒకాయన యోగి కాగలడనేది సత్యం. సూపర్ మాన్ సిరీస్ చూసి భవనాల నుండి దూకిన వారున్నారు. కొన్ని దశాబ్దాల కింద రాంబో సీక్వెల్ చిత్రాల్లో క్లైమాక్స్ మొత్తం హింస ఉండేది. ఆ చిత్రాలు మంచి రాబడిని తెచ్చుకున్నాయి. కొంతకాలం క్రితం అనగా తొంభైల నుంచి 2000 సంవత్సరం వరకు బి. గోపాల్ వంటి దర్శకులు కథానాయకుల చేతికి గొడ్డళ్ళు ఇచ్చి వివరీతంగా జనాలను నరికించేవారు. అయితే సుమోలు గాలిలోకి ఎగరడం అనేది అదనపు




ఆకర్షణగా ఉండేది. అదో రాయలసీమ ఫ్యాక్షనిజానికి బ్రాండ్‌గా మారింది. క్రమంగా వయలెన్స్ కూడిన సెంటిమెంట్‌కు ప్రాధాన్యతనిచ్చే సినిమాలు వచ్చాయి. కలిసుందాం రా?, ప్రేమంటే ఇదేరా? సింహా, అఖండ, సింహాద్రి ఇలా? వీటిలో హిం కు ఒక పరిధిని నిర్ణయించుకున్నారు. ఇది కూడా వర్గ కుటుంబ పరమైన వర్గీకరణలోనే ఉంచేశారు. ఓ సామాజికమైన అంశాన్ని స్పృశిస్తూ .. హింసకు హింసే సమాధానమనే ఆటవిక నినాదంతో రాఖీ, ఖడ్గం, మహాత్మా లాంటి చిత్రాలు వచ్చాయి. ఇవి కూడా బాగానే రెవిన్యూ చేశాయి. (రాఖీ తప్ప). అయితే మనిషి జీవితాలలో ఇంతకన్నా ఎక్కువ హింసనే ఉందనే వాదనను సమాంతరంగా తెరపైకి తెచ్చారు. ఇటువంటి చిత్రాలు విస్మరించేవి విషయమేమిటంటే వ్యక్తిగత హింస కు వ్యవస్థాగత హింస కు మధ్యనున్న సన్నని రేఖ. అయితే చలనచిత్రాలు వసూలు కోసం తీస్తారు. అది వ్యాపారం. లాభనష్టాల అంశాలు ప్రధానం. డబ్బులు వస్తాయని తెలిస్తే హింస ను ఓ కమర్షియల్ పాయింట్ గా, ఓ సక్సెస్ సూత్రంగా ప్రచారం చేస్తారు. ఇదే పంథాను ప్రేక్షకులలోని ఓ సున్నితపు మనస్తత్వం కలిగిన జాతి నిర్మాణ వర్గాలు వృత్తిగా స్వీకరిస్తే.. సామాజిక పరిణామాలు ఎలా ఉంటాయి? ఇవి జరిగిన దాఖలాలు కోకోల్లలు గడిచిన ఐదు దశకాలలో సినిమాలు చూసి హత్యలు చేసిన వారు, మానభంగాలు చేసిన వారు, తప్పించుకునేందుకు సినిమాలలో చూపిన సాంకేతిక మార్గాలను వినియోగించడం లేదా సీ.సీ. కెమెరాలున్నా ధైర్యంగా వాటి ముందు విజయ చిహ్నంగా వ్రేళ్ళు చూపిస్తూ దొంగతనాలు చేస్తున్నారు. వారు దొరికిన తర్వాత ఫలానా చిత్రం లోని సన్నివేశాలు మాకు 'ఇన్స్పిరేషనని చెబుతున్నారు. ఇవే అంశాలతో అక్కినేని, ఆదుర్తి కలిసి సుడిగుండాల నే గొప్ప చిత్రాన్ని నిర్మించారు.కొద్దిరోజుల క్రితం ఏనిమల్ అనే చిత్రం విడుదలైంది. రణబీర్ కపూర్ హీరోగా, సందీప్ రెడ్డి వంగ తెరకెక్కించిన మోస్ట్ వైలెంట్ ఫిలింగా బాక్స్ ఆఫీస్ దగ్గర మొదటి రోజే 116 కోట్లు సాధించి రికార్డు సృష్టించిందని మీడియా వర్గాల కథనం. సినిమాలో అడల్ట్స్, వైలెన్స్ సన్నివేశాలు విపరీతంగా ఉన్నాయని సెన్సార్ వారు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చారు. ఓ వర్గం ప్రేక్షకులైతే ఇందులోని హింసాత్మక సంఘటనలు చిత్రించిన తీరును చూసి అవాక్కవుతున్నారు. పచ్చి బూతులు, నగ్న సన్నివేశాలు, గొంతులను పరాపరా కోసేయడాలు సీన్లు ఇంతగా ఉన్న చిత్రం మధ్యకాలంలో మరొకటి లేదని చెప్పవచ్చు. ఇదే అలవరుసలలో మరికొన్ని చిత్రాలు కూడా రాబోతున్నాయని ఆయా చిత్ర నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి. ఆ మధ్యన వచ్చిన లియు హింస ప్రధాన పాత్రతో ఏ పాటి విజయం సొంతం చేసుకుందో అందరూ చూశారు. భయమంటే ఏమిటో తెలియని మృగాలకు సహితం భయం నేర్పగలవాడిగా జూనియర్ ఎన్టీఆర్‌తో వస్తున్న దేవర చెబుతుంది. ఇందులో అండర్ వాటర్ సీన్స్‌నే కాదు ప్రతీ యాక్షన్ ఎపిసోడ్ చాలా వైలెంట్‌గా ఉండబోతున్నాయనే వార్తలు వస్తున్నాయి. సూర్య నటిస్తున్న గువ లోనూ ఇటువంటి సన్నివేశాలు బోలెడు ఉంటాయని చెబుతున్నారు. చిత్ర సంస్థ విడుదల చేసిన అతని లుక్ చూస్తేనే శత్రువులు భయంతో పరుగులు తీసేలా ఉన్నారనిపిస్తుంది. దర్శకుడు సుకుమార్ పుష్పరాజ్ బన్వర్ సింగ్ యాక్షన్ సీన్స్ పుష్పలో చూసిన వారికి ఇహ రెండులో ఎలా ఉంటారో ఊహించుకోవచ్చు. ఇలా రాబోతున్న చిత్రాల్లోని వైలెన్స్‌తో సెంటిమెంట్ ని జోడించి ఇదిగో నయా ట్రెండ్ అని ప్రచార జో(హో)రు పరిశ్రమ పెంచితే తర్వాత కాలంలో ఎలాంటి చిత్రాలు వస్తాయో ఊహించడం కష్టం కాదు.

# దూసుకు వస్తున్న మరో తుపాన్



అమరావతి: ఏపీకి మరో తుఫాన్ ముప్పు పొంచి ఉంది అంటే అవుననే అంటోంది వాతావరణ శాఖ. మిచౌంగ్ తుఫాన్ ఎఫెక్ట్?తో పంటలు దెబ్బతిని.. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరద బాధితులను ఆదుకోవడంతో పాటు.. పంట నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేస్తుండగానే.. గండం మరో తుఫాన్ రూపంలో ముంచుకొస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.. ఈ వార్నింగ్ బెల్స్ రైతులను మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి..తాజాగా మరో తుఫాన్ రైతులను భయపెడుతోంది. 24 గంటల్లో అల్పడనంగా ఏర్పడనుంది. ఈ తుఫాన్ వాతావరణం ఏపీ,తెలంగాణ రాష్ట్రాల వైపు కదులుతున్నట్టుగా ఐఎండీ వెల్లడించింది. రానున్న ఐదు రోజుల పాటు కేరళ, తమిళనాడు, పుదుచ్చేరితో పాటు పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగ్నేయ అరేబియాలో తుఫాన్ వాతావరణం ఉందని ఐఎండీ తెలిపింది. ఇది మాల్దీవుల పక్కనే సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. దీంతో అల్పపీడనం ఏర్పడునున్నట్లు భారత వాతావరణశాఖ తెలిపింది

# యువగళం పాదయాత్ర ముగింపు సభలోఎన్నికల శంఖారావం పూరిస్తాం

**చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ హాజరవుతారు : అచ్చెన్నాయుడు**



భోగాపురం (విజయనగరం జిల్లా):నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సభలో ఎన్నికల శంఖారావం పూరిస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ సభ ఏర్పాట్లకు సంబంధించి విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లి సమీపంలోని భూమాత లేఅవుట్‌లో సోమవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు యువగళం పాదయాత్ర ముగింపు సభ ఐదు లక్షల మందితో నిర్వహిస్తామని చెప్పారు. ఈ సభకు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, నందమూరి బాలకృష్ణ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ హాజరవుతారని తెలిపారు. ఈ సభను విశాఖలోని ఎయు గ్రౌండ్‌లో నిర్వహించేందుకు ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్‌కు లేఖ రాశామని, అనుమతి ఇస్తామని ముందు చెప్పి, వైసిపి ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడితో ఆ రోజు ఆర్గానిక్స్ డే నిర్వహిస్తామని అనుమతి ఇవ్వలేమని చెప్పారని వివరించారు. ప్రస్తుతం భూమాత లేఅవుట్ యాజమాన్యం స్థలం ఇచ్చిందని, వారిపైనా వైసిపి వారు ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. అయినా, యాజమాన్యం తమకు సహకరించి సభకు స్థలం ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం బస్సులు కావాలని ఆర్‌టిసి ఎమ్‌డికి లేఖ రాస్తామన్నారు. వారు నిర్ణయించే రేటు ప్రకారం బస్సులకు అద్దె చెల్లిస్తామని చెప్పారు. బస్సులు ఇవ్వకుండా ఇబ్బందిపెడితే, వంద రోజుల్లో వచ్చేది తమ ప్రభుత్వమేనని, వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టిడిపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు కళా వెంకటరావు, కేంద్ర మాజీ మంత్రి ఆశోక్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

# పలు కార్యక్రమాల్లో పాల్గొన్న డీజీపీ రాజేంద్రనాథ్



రైల్వే కోడూరు : ప్రజాపాలన ప్రతినిధి :అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలంలోఈ రోజు మధ్యాహ్నం అధికార పార్టీలో భాగంగా లిఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డి జి పి కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి లి రాయచోటికి వెళ్తూ రైల్వే కోడూరు లోని లిముఖ్యమంత్రి సలహాదారుడు రక్కాసి ధనుంజయ్ రెడ్డి లి నివాసానికి వచ్చినందున డి జి పి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన లిగంగాధర నెల్లూరు ఎన్నికల పరిశీలకులు %ు% మండల కన్వీనర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి . ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు గురువు రెడ్డి,అన్నమయ్య జిల్లా వ్యవసాయక మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి,పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి,చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, జెసియస్ మండల కన్వీనర్ అమరేశ్వర్ రెడ్డి, చిన్న ఓరంపాడు ఎంపీటీసీ గోగడ దుర్గా ప్రసాద్,వైఎస్ఆర్ సీపీ నాయకులు నాగినేని రమేష్ కుమార్ నాయుడు,వైఎస్ఆర్ సీపీ యువ నాయకులు అశోక్,మారే సుకుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా మన బీసీ హక్కులు సాధించుకుందాం: పోతిన మహేష్



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి :విజయవాడ పశ్చిమ పార్టీలకు కులమతాలకు అతీతంగా. అందరు కలిసికట్టుగా ఉండి మనం ప్రభుత్వం నుండి రావాల్సిన హక్కులను బీసీల ఎదుగుదలనుసాధించుకుందాం పోతిని మహేష్ మాట్లాడుతూ..నాగవంశీయులురాజకీయంగా ఎదగాలి.బీసీ.డీ నుంచి బిసి.ఏ కు బీసీ జాబితాలో మార్పు చేసే విధంగా మరియు రాబోయే ప్రభుత్వంలో ఉన్నతమైన పదవులు అధిరోహించేందుకు తప్పక సహకరిస్తానని వీరి న్యాయబద్ధమైన కోరికలు అన్నిటిని పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టిలో ఉంచి వేరు ఉన్నతంగా ఎదిగేందుకు తోడ్పాటును అందిస్తానని హామీ ఇచ్చినారు. జక్కంపూడిలోనాగవంశీయుల సంక్షేమ సంఘం వారు ఏర్పాటు చేసిన కార్తీక వన సమారాధన కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ పోతిన వెంకట మహేష్. తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎర్రబోతు రమణ కి నాగవంశీకుల కుల నాయకుడు మద్దిల శ్రీనివాసరావు. మరియు కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు మహేష్ తెలియజేశారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
సంపాదకీయం
మంగళవారం 12, డిసెంబరు 2023

# ఇండియా కూటమిలో చిటపటలు

హిందీ బెల్టులోని రాష్ట్రాల ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న కాంగ్రెస్ పార్టీ పుంజుకునే ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఎన్డీయే ఓటమే లక్ష్యంగా ఏర్పాటైన ఇండియా కూటమి యుద్ధానికి ముందే చతికిలపడింది. కాంగ్రెస్ పట్ల భాగస్వామ్య పక్షాల అసంతృప్తి కారణంగా అసలుకే ఎసరు వచ్చింది.రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా రావడంతో సార్వత్రిక పోరుపై దృష్టి పెట్టిన కాంగ్రెస్‌పై ఇండియా కూటమిలోని మిగతా పార్టీలు గుర్రుగా ఉన్నాయి. ప్రధాన పక్షాల అసమ్మతి కారణంగా కూటమి సమావేశం వాయిదా వేయాల్సి వచ్చింది. పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, నితీశ్‌కుమార్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితర నేతల అసంతృప్తే అందుకు కారణం. కూటమి కో-ఆర్డినేషన్ కమిటీలో ప్రధాన భూమిక పోషిస్తున్న వీరంతా దుమ్మా కొట్టనున్నట్టు తాఖీదులు ఇవ్వడంతో సమావేశం వాయిదా పడింది.చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు.. కీలక రాష్ట్రాలైన రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో చతికిలపడ్డ కాంగ్రెస్ ఆగమేఘాల మీద ఇండియా కూటమిపై దృష్టిసారించింది. దీంట్లో భాగంగానే ఢిల్లీలో సమావేశం ఏర్పాటు చేసింది. కానీ ఈ సమావేశం గురించి కూటమిలోని భాగస్వామ్య పక్షాలకు ముందస్తుగా కనీస సమాచారం ఇవ్వకపోవడంతో అవి కాంగ్రెస్‌పై మండిపడుతున్నాయి. ముందస్తుగా షెడ్యూల్ చేసిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆరోగ్యం సహకరించడం లేదని బీహార్ సీఎం నితీశ్ కుమార్.. సాకుగా చూపి సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. తమిళనాడులో వరదల కారణంగా ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్, వ్యక్తిగత కారణాల వల్ల జార?ండ్ సీఎం హేమంత్ సోరెన్ సమావేశానికి అందుబాటులో ఉండటం లేదు. కీలక నేతల గైర్హాజరీ కారణంగా కాంగ్రెస్ సమావేశాన్ని వాయిదా వేయక తప్పలేదు. అయితే కీలక నేతల అసమ్మతికి పలు కారణాలున్నాయి. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ఒంటెత్తు పోకడల కారణంగానే ప్రాంతీయ పార్టీలు కూటమికి దూరమవుతున్నట్టు తెలుస్తున్నది. సమావేశం గురించి తనకు సమాచారం లేదని మమతా బెనర్జీ వ్యాఖ్యానించడమే అందుకు ఉదాహరణ. తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ వైఖరిపై మమతా బెనర్జీ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రాంతీయ పార్టీలతో సీట్ల సర్దుబాటు గురించి ఆమె వ్యాఖ్యానించారు. ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలను విస్మరించిన కాంగ్రెస్ బొక్కబోర్లా పడింది. ముఖ్యంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని అనేక స్థానాల్లో ఓటమి అంతరం చాలా తక్కువగానే ఉన్నది. ప్రాంతీయ పార్టీలు ఓట్లు చీల్చడంతోనే ఆయా స్థానాలు బీజేపీ వశమయ్యాయి. ప్రాంతీయ పార్టీలతో సీట్ల సర్దుబాటులో విఫలమైన కాంగ్రెస్ చాలాచోట్ల వారిని ఎదుర్కోవాల్సి వచ్చింది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఏకంగా 20 స్థానాల్లో ఒకదాన్నొకటి ఢీ కొన్నాయి. సీట్ల సర్దుబాటు గురించి అఖిలేశ్ యాదవ్, మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు ముందుగానే సూచించారు. అయినా వారి ప్రతిపాదనలను కాంగ్రెస్ పెడచెవిన పెట్టింది. దీంతో కాంగ్రెస్‌కు భాగస్వామ్య పక్షాలకు మధ్య అంతరం పెరిగింది.ఇండియా కూటమి ప్రధాన ఉద్దేశమైన ఎన్డీయే ఓటమి దిశగా ప్రణాళికలు రూపొందించడంలో కాంగ్రెస్ విఫలమైందని భాగస్వామ్య పక్షాలు ఆరోపిస్తున్నాయి.ఐదు రాష్ట్రాల ఎన్నికలపైనే ప్రధానంగా దృష్టి పెట్టిన హస్తం.. కూటమి కార్యాచరణను పూర్తిగా పక్కకు పెట్టేసింది. ముంబైలో చివరిసారిగా సమావేశమైన కూటమి కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఇప్పటివరకు మరోసారి సమావేశం కాలేదు. ఇది అసంతృప్తికి మరో కారణం.మరో నాలుగైదు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు ఉన్నప్పటికీ సీట్ల సర్దుబాటు, కార్యాచరణపై ఎటువంటి ముందడుగు పడలేదు. ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై సమాలోచనలు జరగలేదు. దీంతో ప్రాంతీయ పార్టీల నేతలు కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. తాజా ఎన్నికల్లో చాలాచోట్ల ఒంటరి పోరుకు దిగిన కాంగ్రెస్ రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో అధికారాన్ని కోల్పోయింది. మధ్యప్రదేశ్, మిజోరంలో ఓటమి పాలై ప్రస్తుతం ఉత్తర భారతదేశంలో హిమాచల్‌ప్రదేశ్, దక్షిణాదిలో కర్ణాటక, తెలంగాణకే పరిమితమైంది. మరికొద్ది రోజుల్లో జరగనున్న సమావేశానికి కూటమిలోని అసంతృప్త నేతలు అలకపాన్పు వీడి హాజరవుతారా లేదా అన్నది అందరి ముందున్న ప్రశ్న.

సామాజిక దృక్పథంతో మీరు రాసే రచనలు
editor. prajapalana@gmail.com
మెయిల్ కు పంపించినచో ప్రజా పాలన
దినపత్రికలో ప్రచురించబడును

# బాలల హక్కులు



'పాపం, పుణ్యం, ప్రపంచమార్గం/ కష్టం, సౌఖ్యం, శ్లేషార్థాలూ/ ఏమీ ఎరుగని పూవుల్లారా/ అయిదారేడుల పాపల్లారా/ మెరుపు మెరిస్తే/ వాన కురిస్తే/ ఆకసమున హరివిల్లు విరిస్తే/ అవి మీకే అని ఆనందించే/ కూనల్లారా' అంటాడు శ్రీశ్రీ. బాలలు స్వేచ్ఛా విహంగాలు. బాల్యం అందమైన జ్ఞాపకం. ఏ మనిషి వ్యక్తిత్వం అయినా బాల్యంతో పెనవేసుకునే వికసిస్తుంది. బాలలు దేశ అభివృద్ధికి అతి పెద్ద పెట్టుబడి. మనిషికి గాలి, నీరు, ఆహారం, ఎంత అవసరమో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అంతే అవసరం. మానవ హక్కులలో ఒక ముఖ్యమైన భాగం బాలల హక్కులు. రక్షణ, విద్య, సంరక్షణ, సామాజిక, సాంస్కృతిక జీవనంలో చురుకైన పాత్ర నిర్వహించే ప్రతి హక్కూ బాలలకు వున్నాయి. 'ప్రతి బిడ్డకూ ప్రతి హక్కు' వుంది. 'చదువని వాడజ్ఞుండగు/ చదివిన సదసద్వివేక చతురత గలుగున్' అంటాడు పోతన. 'చదువు జదవుకున్న/ సౌఖ్యంబులును లేవు/ చదువుజదివెనేని సరసుడగును/ చదువు మర్మమెరిగి చదువంగ చూడుము' అంటాడు వేమన. 'విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పురుషాళికిన్/ విద్య యశస్సు భోగకరి, విద్య గురుండు విదేశ బంధుడన్/ విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్/ విద్య నృపాల పూజితము, విద్య నెఱుంగనివాడు మర్త్యుడే?' అని విద్య ప్రాధాన్యత చెబుతాడు భర్తృహరి. కనుకనే-పిల్లల హక్కుల చట్రంలో అత్యంత ముఖ్యమైన వాటిలో విద్యాహక్కు ఒకటిగా మారింది. అంతేకాదు-సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగే హక్కూ పిల్లలకు వుండాలి.దాదాపు 45 కోట్ల మంది పిల్లలున్న దేశం మనది. వికసిత భారత్ వంటి ఎన్ని భుజకీర్తులు తగిలించుకున్నా దయనీయమైన స్థితిలో బతుకుతున్న పిల్లల్లు్నలక్షల్లో వున్నారు. బాలికల పరిస్థితి మరింత దుర్భరంగా వుంది. సరైన ఆహారం లేక, ఆశ్రయం లేక, వీధుల్లో బతుకుతూ అనారోగ్యం పాలై, లైంగిక వేధింపులకు గురవుతూ వ్యభిచార కూపంలోకి నెట్టబడుతున్నవారు అనేకమంది వున్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు మానవ హక్కులపైనా, బాలల హక్కులపైనా దాడి జరుగుతోంది. యుద్ధం జరుగుతున్న ప్రతి చోటా మొదటి బాధితులు బాలలే. 190కి పైగా దేశాలలోని బాలల సంక్షేమ అభివృద్ధి కోసం పాటు పడే యునిసెఫ్ ప్రతి డిసెంబర్ 11న ఒక కొత్త థీమ్‌ను ప్రకటిస్తుంది. ఈ ఏడాది 'ప్రతి బిడ్డకు ప్రతి హక్కు' అనే థీమ్ తీసుకున్నారు. జీవించే హక్కు, విద్యాహక్కు, సామాజిక భద్రత హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భావవ్యక్తీకరణ హక్కు, సమానత్వ హక్కు వంటి 40 రకాల హక్కులు బాలలకు వున్నాయి. బాలలను రక్షించేందుకు ప్రభుత్వాలు చట్టాలు చేయాలి. శరణార్థులుగా మారిన బాలలకు మానవతతో సాయం అందించాలి. మానసిక, శారీరక వికలాంగులైన వారి వృద్ధికి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపుదలకు చర్యలు తీసుకోవాలి.'బతుకంటే చావు కాదనీ/ ఆహారమంటే గాలి కాదనీ/ ఈ భూమి ఎవరి సొత్తు కాదనీ/ బతికే హక్కు మీకు వుందనీ మీరు తెలుసుకుంటారు' అంటారో కవయిత్రి. పెద్దలకు హక్కులున్నట్లే, పిల్లలకీ హక్కులున్నాయి. ఆ హక్కులను కాపాడాలి. పడుతూ లేస్తూ పరుగులెడుతూ పడిపోయిన ప్రతిసారీ కొత్త విషయాలను ఆకళింపు చేసుకుంటూ స్వేచ్ఛగా ఎదగనివ్వాలి. బాల్యం అంటేనే రంగుల హరివిల్లు. అనుభూతుల విరిజల్లు. అదేసమయంలో మింగుడు పడని విషాదాలు, కనబడని కల్లోలాలూ వుంటాయి. అన్నిటినీ తట్టుకుని నిలబడగలిగే విద్య, వివేకం బాలలకు అందించాలి. నేర్చుకోగలిగే సుహృద్భావం, ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి. వాన కురిసినా, మెరుపు మెరిసినా తమ కోసమే అని ఆనందించే వారి హక్కులను కాపాడాలి. బాలలకు ఉచితంగా విద్యనందించడం, మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. వారు స్వేచ్ఛగా చదువుకునే హక్కును కల్పించాలి. వారే రేపటి మన భవిత, భవిష్యత్తూ. 'మీదే మీదే సమస్తవిశ్వం/ మీరే లోకపు భాగ్యవిధాతలు/ మీ హాసంలో మెరుగులు తీరును/ వచ్చేనాళ్ల విభాప్రభాతములు' అని శ్రీశ్రీ తన ఆకాంక్ష వ్యక్తం చేస్తాడు. ఆ బాధ్యతను ప్రభుత్వాలు సక్రమంగా నెరవేర్చాలి. బాధాకరమైన విషయం ఏమిటంటే-నవంబర్ 14 బాలల దినోత్సవం రోజున ఇజ్రాయిల్ దాడుల్లో చనిపోతున్న, నెత్తురోడుతున్న పాలస్తీనా చిన్నారులకు సంఘీభావం తెలిపేందుకు ముంబయిలోని జహువా బీచ్ వద్ద గుమికూడిన బాలలను కొందరిని అరెస్టు చేశారు. రక్షకులే భక్షకులుగా మారుతున్న ఈ స్థితిలో బాలల హక్కుల కోసం నిలబడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుంది.

# సామాజిక భద్రత కల్పించని పాలకులు




సామాజిక పెన్షన్లను కనీసంగా రూ.10,000కు పెంచటానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంపన్నులపై పన్నులు వేసి సేకరించాలి. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ విధానం అమలు చేసే విధంగా ఇప్పటి నుండే ఒత్తిడి చేయాలి. సామాజిక పెన్షన్లను కేవలం దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నవారికి మాత్రమే పరిమితి చెయ్యడం సరికాదు. బిపిఎల్ అయినా, ఎపిఎల్ అయినా దానితో సంబంధం లేకుండా శ్రామికులందరికీ వృద్ధాప్యంలో పెన్షన్ ఇవ్వాలి. ఆదాయ పరిమితి పేరుతో కుటుంబంలో సభ్యులుగా ఉండి ఇతర వృత్తులు చేసుకున్నవారికి ఇవ్వకపోవడం సరికాదు.వ్యవ్యవసాయ కార్మికులు, రైతులు, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు ఆదాయాలు, వేతనాల సమస్యను ఎదుర్కొంటున్నారు. వృద్ధాప్యంలో పనులు, ఉద్యోగాలు చేయలేని సమయంలో వీరిని ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరిస్తున్నాయి. పైగా అది తమ పని కాదని, వారి కుటుంబాలే చూసుకోవాలని వాదిస్తున్నాయి.

సామాజిక పెన్షన్లు

వృద్ధులకు ఇచ్చే సామాజిక పెన్షన్లు ఉచితంగా ఇచ్చేవి కావు. 30, 40 సంవత్సరాలు సమాజానికి సేవ చేసినందుకు ప్రభుత్వం బాధ్యతగా ఇచ్చేవి. వాటికి కానుకలుగా పేరుపెట్టడం సమంజసం కాదు. వై.ఎస్.ఆర్, ఎన్.టి.ఆర్, ఇందిరమ్మ పేర్లతో వాటిని పిలవడం పెన్షనర్లను తమ ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవటానికే. వారిని ఆ విధంగా చిన్న చూపు చూడడం ప్రభుత్వాల బాధ్యాతారాహిత్యం. నెలకు రూ.2750 పెన్షన్‌గా ఇచ్చి చేతులు దులుపుకునే చర్యను కూడా రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోంది. ఇవి ఎవరి జేబులో నుండి సొంతగా ఇచ్చేవి కావు. ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులలో భాగంగా వచ్చేవి. పెన్షన్ పొందటాన్ని పెన్షనర్ల ప్రాథమిక హక్కుగా ఉన్నత న్యాయస్థానం గుర్తించింది. రాజ్యాంగం ప్రకారం కూడా జీవించే హక్కులో భాగంగా పెన్షన్ హక్కు ఉంటుంది.

అందరితో ఉంటాం, అందరి శ్రేయస్సు కోసం పని చేస్తామని చెప్పుకునే మోడీ ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్లకు కేవలం నెలకు రూ.200 మాత్రమే ఇస్తోంది. 80 సంవత్సరాలు, ఆపైన వయస్సు ఉన్నవారికి మాత్రమే రూ.500 చొప్పున కేటాయిస్తోంది. మిగతా భారం అంతా రాష్ట్ర ప్రభుత్వాలపై నెడుతోంది. సామాజిక పెన్షన్లను కనీసం రూ.10,000 చేయాలని కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు మోడీ ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

సామాజిక పెన్షన్లను కనీసంగా రూ.10,000కు పెంచటానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంపన్నులపై పన్నులు వేసి సేకరించాలి. రాబోయే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ విధానం అమలు చేసే విధంగా ఇప్పటి నుండే ఒత్తిడి చేయాలి. సామాజిక పెన్షన్లను కేవలం దారిద్ర్య రేఖకు దిగువున ఉన్నవారికి మాత్రమే పరిమితి చెయ్యడం సరికాదు. బిపిఎల్ అయినా, ఎపిఎల్ అయినా దానితో సంబంధం లేకుండా శ్రామికులందరికీ వృద్ధాప్యంలో పెన్షన్ ఇవ్వాలి. ఆదాయ పరిమితి పేరుతో కుటుంబంలో సభ్యులుగా ఉండి ఇతర వృత్తులు చేసుకున్నవారికి ఇవ్వకపోవడం సరికాదు.

ఇపిఎస్ పెన్షన్లు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, సహకార రంగం, ప్రైవేటు సంస్థలలో పని చేస్తూ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ చందాదారులుగా వున్న ప్రతి ఒక్కరికీ పని నుండి దిగిపోయిన తరువాత వృద్ధాప్యంలో ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం కింద పెన్షన్లు వస్తాయి. ఈ స్కీం కింద ఉండే పెన్షన్ నియమాల ప్రకారం చాలా తక్కువ పెన్షన్ వస్తుంది. పెరిగిన ధరలకు నష్టపరిహారం (కరువు భత్యం) కూడా ఉండదు. జీతం పెద్ద స్థాయిలో వున్న వారికి కూడా పెన్షన్ చాలా తక్కువగా వస్తుంది.

కనీస పెన్షన్‌ను నెలకు 9 వేల రూపాయలకు పెంచాలని ఇపిఎస్ పెన్షనర్ల సంఘాలు అడుగుతున్నా మోడీ ప్రభుత్వం కదలడం లేదు. ప్రస్తుతం కనీస పెన్షన్ కేవలం వెయ్యి రూపాయలు. దీన్ని రెండు వేలకు పెంచుతారా? అని పార్లమెంట్ సభ్యులు అడిగితే మోడీ ప్రభుత్వం తన దగ్గర అంత డబ్బు లేదని, పెంచలేనని చెప్పింది. అదే సమయంలో ప్రతి సంవత్సరం కార్పొరేట్ కంపెనీల ఆదాయ పన్నులలో 2 లక్షల కోట్ల రూపాయలకు పైగా రాయితీలు ఇస్తోంది.వాస్తవంగా కేంద్ర ప్రభుత్వానికి పైసా ఖర్చు గాకుండానే ఇపిఎస్ పెన్షనర్ల పెన్షన్‌ను గణనీయంగా పెంచే అవకాశం ఉంది. కార్మికులకు చెందిన పి.ఎఫ్ డబ్బులలో కొంత భాగాన్ని పెన్షన్ ఫండ్‌కు తరలిస్తారు. 2023 మార్చి 31 నాటికి ఈ పెన్షన్ ఫండ్ నిల్వ రూ.7 లక్షల 80 వేల కోట్లు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో ఈ ఫండ్‌కు రూ. 1 లక్ష 17 వేల కోట్లు జమయ్యాయి. దీనిలో వడ్డీ రూపేణా వచ్చిన జమ ఒక్కటే రూ. 52 వేల కోట్లు. కానీ ఈ సంవత్సరంలో 75 లక్షల మంది పెన్షనర్లకు చెల్లించిన పెన్షన్ మొత్తం రూ.14 వేల కోట్లు మాత్రమే. అంటే సరాసరిన ఒక్కొక్కరికి నెలకు రూ. 1592 మాత్రమే చెల్లించారు. ఇది సామాజిక పెన్షన్ల కంటే కూడా చాలా తక్కువ.పరిమితికి మించి వాస్తవ వేతనం మీద పి.ఎఫ్ కట్టిన చందాదారులకు పి.ఎఫ్ నిబంధనల ప్రకారం అధిక పెన్షన్ ఇవ్వాలి. కాని కేంద్ర ప్రభుత్వం నిరాకరించడంతో దీన్ని చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయినప్పటికి మోడీ ప్రభుత్వం దాన్ని అమలు చెయ్యకుండా తాత్సారం చేస్తోంది. సుప్రీంకోర్టు తీర్పు కూడా కొందరికి చేదుగా, కొందరికి తీపిగా ఉండటం కూడా సహజ న్యాయానికి విరుద్ధం. ఈ తీర్పు ప్రకారం 2014కు ముందు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, కార్మికులకు అధిక పెన్షన్ వర్తించదు. 2014 సెప్టెంబర్ 1 నాటికి సర్వీసులో కొనసాగుతున్న వారికి మాత్రమే సుప్రీం కోర్టు తీర్పు వర్తిస్తుంది. అత్యున్నత న్యాయస్థానం కూడా పాలక ప్రభుత్వాల ఒత్తిడికి లోనుకావడం పెన్షనర్లకు నష్టం చేసింది.

దాదాపు రూ. 8 లక్షల కోట్లు పెన్షన్ ఫండ్ నిల్వలు ఉన్నప్పటికీ పెన్షన్లు పెంచడానికి మోడీ ప్రభుత్వం ఎందుకు సిద్ధం కావడంలేదు? దానిలో సగం నిల్వను ఉపయోగించి పెన్షనర్లు కోరుతున్న విధంగా కనీస పెన్షన్ రూ. 9 లేదా 10 వేలు చెల్లించే అవకాశం ఉన్నా కూడా మోడీ ప్రభుత్వం ఎందుకు నిరాకరిస్తోంది ?

మోడీ ప్రభుత్వం ఇపిఎస్ పెన్షన్ స్కీంను మార్చాలనే ఆలోచనలో ఉంది. పెన్షన్ ఫండ్ మొత్తాన్ని విదేశీ పెట్టుబడుల సేవకు మరియు అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థల వాటాల విలువలను పెంచేందుకు ఉపయోగించాలని చూస్తోంది. మోడీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లలో సామాజిక భద్రతా కోడ్ ఒకటి. 2024 ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే ఈ కోడ్ అమలు లోకి వస్తుంది. దీని ప్రకారం పెన్షన్ స్కీంలో మోడీ ప్రభుత్వం మార్పులు చేస్తుంది. పార్లమెంట్ ఆమోదం కూడా అవసరం లేదు. కార్మికుల నిధి రూ.8 లక్షల కోట్లు జూదపూరిత షేర్ మార్కెట్‌కు తరలిపోతాయి. కార్మికులకే చెందిన ఈ నిధి మొత్తం కార్మికులకే ఉపయోగపడాలంటే మోడీ తిరిగి అధికారంలోకి రాకుండా చూడాలి. కొత్త ప్రభుత్వం ఏదైనా సరే కార్మికులకే ఈ నిధిని ఉపయోగపెట్టేలా ఆందోళనలు చెయ్యాలి. దీనికి ఎన్నికలే మంచి సమయం.

## రాజా గారి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిని మూసి వేస్తూ ఏర్పాటు చేసిన భారీ కేడ్లను తొలగించాలి



మచిలీపట్నం డిసెంబర్ 11 ప్రజాపాలన :మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని రాజా గారి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిని మూసి వేస్తూ ఏర్పాటు చేసిన భారీ కేడ్లను తొలగించాలని జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ ఈరోజు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీకి వినతిపత్రం సమర్పించారుఅధికారులు వెంటనే స్పందించి ప్రజల రాకపోకల సౌకర్యార్థం గతంలో వలె ట్రాఫిక్ పోలీసులను. నియమించి అడ్డుగా ఉన్న బారికెడ్లను తొలగించి ప్రధాన రహదారి అయిన వల్లూరి రాజా గారి సెంటర్ కూడలి ప్రజల సౌకర్యార్థం తిరిగి యధాస్థితి కల్పించాలని వినతి పత్రంలో రామకృష్ణ కోరారు వారితోపాటు మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు జిల్లా ఉపాధ్యక్షుడు,వంపుగడవల చౌదరి, రాష్ట్ర మత్స్యకార నాయకులు మోకా రవి జనసేన టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయం ముందు రైతుల ఆందోళన




పామర్రు, ప్రజాపాలన ప్రతినిధి : తోట్లవల్లూరు మండలంలో తాసిల్దార్ కార్యాలయం ముందు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని పామర్రు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా, టిడిపి నాయకులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది వైసీపీ నాయకులు అధికారులు ఫోటోలకు ఫోజులు ఇవ్వడానికే పరామర్శలు చేస్తున్నారని,విత్తనాలు సరఫరా లో ఇంతవరకు స్పష్టత ఇవ్వటం లేదని రైతులను ఆదుకోవడం మానేసి ఓట్ల తొలగింపు పనిగా పెట్టుకున్నారన్నారు .రైతులను ఇన్ని ఇబ్బందులు పెడుతున్న నాయకులు రాబోయే రోజుల్లో రైతులు ఓటు ద్వారా వేసే పోటుకు ప్రభుత్వం బంగాళాఖాతంలో కలిసిపోతారని అన్నారు.

## స్వయంభు లింగాలకు అభిషేకం చేసిన పేర్ని నాని దంపతులు



మచిలీపట్నం డిసెంబర్ 11 ప్రజాపాలన :మచిలీపట్నం సోమవారం మంగినపూడి దత్త రామేశ్వర పుణ్యక్షేత్రంలో కార్తీక మాస చివరి సోమవారం సందర్భంగా మచిలీపట్నం మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు పేర్ని వెంకటరామయ్య దంపతులచే స్వయంభు లింగాలకు అభిషేకం చేశారు. రుద్ర హెూమం , ప్రత్యేక అభిషేకాలు పేర్ని నాని దంపతులచే పూజారి (విష్ణుబట్ల. సూర్యనారాయణ శర్మ ) చే నిర్వహించినారు. తదనంతరం ఆలయ కమిటీ సభ్యులు కురాళ్ళ.రమేష్ బాబు , మాటూరి.రాంబాబు, సూర్యనారాయణ , విఘ్నేశ్వర రావు , తదితరులు ఆలయ మర్యాదలతో స్థానిక శాసనసభ్యులను సత్కరించారు.

## యేసుక్రీస్తు పుట్టిన డిసెంబర్ నెల ఎంతో పవిత్రమైనది...



గోకవరం ప్రజాపాలన డిసెంబర్ 11: తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గం గోకవరంలో జిల్లాపాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ (కన్నబాబు) హలొనెన్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మన్ భారీ ఎత్తున నిర్వహించబడింది.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,జగ్గంపేట మాజీ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, ఆంధ్రప్రదేశ్ పెంతెకోస్తు అధ్యక్షులు జాన్ లాజరస్, స్టేట్ సెక్రటరీ మర్రి డానియల్, ఏపీ ఏఐసిసి అధ్యక్షులు రైమో జుహాని హలొనెన్ పాల్గొనడం జరిగింది. ఈ క్రిస్మస్ వేడుకల్లో సుమారుగా 7 వేలకు పైగా క్రైస్తవ విశ్వాసులు, క్రైస్తవ స్నేహితులు పాల్గొనడం జరిగింది.. కొవ్వొత్తులు వెలిగించి, భారీ కేకును కట్ చేసి, అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు కారణజన్ముడని, ప్రతి ఒక్కరికి ప్రేమను పంచి శాంతిని బోధించిన గొప్ప దేవుడని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గం లో ఇంత భారీ స్థాయిలో క్రిస్మస్ వేడుక జరుపుకోవడం ఇదే మొదటిసారని ఇకనుండి ప్రతీ సంవత్సరం ఇలానే గొప్పగా ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. జగ్గంపేట, గండేపల్లి,కిర్లంపూడి, గోకవరం మండలంలోని క్రైస్తవ విశ్వాసులతో క్రైస్తవ స్నేహితులతో సభా ప్రాంగణం ఎక్కిరిసిపోయింది.

## బీసీల అభ్యున్నతికి, గౌడ సామాజిక వర్గ సంక్షేమానికి కృషిచేస్తా

**బిసి మహిళా సంఘం అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిలర్ సూరగాని లక్ష్మి**

**అత్యంత ఘనంగా గౌడ సామాజిక వర్గ వన సమారాధన కార్యక్రమం**



వేటపాలెం, డిసెంబర్ 11, ప్రజాపాలన : బీసీల అభ్యున్నతికి, గౌడ సామాజికవర్గ సంక్షేమానికి, తన వంతు అంకితభావంతో కృషిచేస్తానని, బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు, చీరాల మున్సిపల్ కౌన్సిలర్ సూరగాని లక్ష్మి అన్నారు. వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పరిధిలోని, రావూరిపేట లోని నాగవరపమ్మ అమ్మవారి గుడి ప్రాంగణంలో, గౌడ సామాజిక వర్గ వన సమారాధన కార్యక్రమం అత్యంత ఘ నంగా జరిగింది. ఈ సందర్భంగా గౌడ సంఘ అధ్యక్షులు కాయల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో, ముఖ్య అతిథిగా సూరగాని లక్ష్మి, విశిష్ట అతిథిగా రామన్నపేట పంచవటి క్షేత్ర కన్వీనర్ శివకేశవ గురూజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బీసీ మహిళా సంఘ అధ్యక్షురాలు, చీరాల మున్సిపల్ కౌన్సిలర్ సూరగాని లక్ష్మి మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి, గౌడ సామాజిక వర్గ సంక్షేమానికి, తన వంతు అంకితభావంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు. పంచవటి క్షేత్ర కన్వీనర్ శివకేశవ గురూజీ కార్తీకమాస విశిష్టతను, సోమవార ప్రత్యేక పూజల ప్రాధాన్యతను వివరించారు. సంఘీయులకు, వివిధ రకాల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆహ్లాదకర మైన వాతావరణంలో వనభోజనాలు, ఆటలు, పాటలు, సాంస్కృతిక తదితర కార్యక్రమాలు ఉల్లాసంగా., ఉత్సాహంగా., జరిగాయి. కార్య క్ర మంలో బీసీ మహిళాసంఘం అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిలర్ సూరగాని లక్ష్మి,పంచవటి క్షేత్ర కన్వీనర్ శివ కేశవ గురూజీ, ప్రముఖ వ్యాపా రవేత్త సూరగాని నరసింహారావు, గౌడ సంఘ ప్రధాన కార్యదర్శి డివిఆర్ నాగరాజు, కోశాధికారి కర్పూరపు శ్రీనివాసరావు, వేటపాలెం మాజీ సర్పంచ్ కర్పూరపు రమాదేవి, మాజీ ఎంపీటీసీ కర్పూరపు ప్రసాద్, చీరాల గౌడ సంఘ గౌరవాధ్యక్షులు యెనుముల యానాదిరావు, చీరాల గౌడ సంఘ అధ్యక్షులు నాశన రామకోటేశ్వరరావు,సెక్రటరీ కాటా హనుమంతరావు, కర్పూరపు రమేష్, కర్పూరపు సీతారామయ్య, దేవరకొం డ పోలయ్య, కోట హనుమంతరావు, వై.సుబ్బారావు, సిద్ధాంతి సు బ్బారావు తదితర ప్రముఖ గౌడ సంఘీయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నాదెండ్ల మనోహర్ అరెస్టు అక్రమం: బొమ్మిడి నాయకర్



నరసాపురం, డిసెంబర్ 11 (ప్రజా పాలన ప్రతినిధి) :ప్రజా సమస్యలపై ప్రజల పక్షాన పోరాడుతున్న జనసేన పార్టీ పీఏసీ ఛైర్మెన్ నాదెండ్ల మనోహర్ ను వైసీపీ ప్రభుత్వం శనివారం విశాఖపట్నం లో అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అక్రమ అరెస్టులకు భయపడి జనసేన పార్టీ వెనకడుగు వేయదని ప్రజా సమస్యలపై రాజీ పడేదే లేదని జనసేన పార్టీ రాష్ట్ర పిఏసి సభ్యుడు, తెదేపా- జనసేన రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడు, నరసాపురం నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ బొమ్మిడి నాయకర్ అన్నారు. స్థానిక నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తన భవనాల నిర్మాణాల కొరకు రహదారితో పాటు జంక్షన్ ను కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన నేర్పద్యంలో దీనిపై గత కొద్ది కాలంగా జనసేన పార్టీ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని అన్నారు. దీనిపై స్పందించి ప్రజల పక్షాన నిలిచేందుకు, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు విశాఖపట్నం చేరుకున్న నాదెండ్ల మనోహర్ ను, జనసేన పార్టీ నాయకులను వైసిపి పెద్దల ఆదేశాల మేరకు పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వారిని తక్షణమే విడుదల చేయాలని నాయకర్ డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం ప్రజా సమస్యలపై పోరాడే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు పోలీసులను ఉపయోగించడం సరైన పద్ధతి కాదని ఆయన మండి పడ్డారు. వైసిపి ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై కక్షపూరిత కార్యక్రమాలు మానుకొని ప్రజల మీద నిజమైన ప్రేమ ఉంటే మొన్న సంభవించిన మిచాంగ్ తుఫాన్ బాధితులకు అండగా నిలబడేందుకు చర్యలు చేపట్టాలని హితవు పలికారు. రాష్ట్రంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో రాష్ట్రంలో జనసేన, తెదేపా ఉమ్మడి ప్రభుత్వం రానున్నదని వైసీపీ నేతలు చేసే అక్రమాలకు తగిన మూల్యం చెల్లించక తప్పదని ఈ సందర్భంగా నాయకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వాతాడి కనకరాజు, గుబ్బల మార్రాజు, తోట నాని, యాదంరెడ్డి సుబ్బారావు, పోలిశెట్టి నళిని, ఇంటి మురళి, నల్లి రాజేష్ ,గ్రంధి నాని, మాట్ల సూర్య, కుసుమ కిరణ్, పెద్ద సంఖ్యలో నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలని కోరుతూ సిపిఎం ధర్నా



నరసాపురం, డిసెంబర్ 11 (ప్రజాపాలన ప్రతినిధి) : మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. మిచౌంగ్ తుఫానులో నష్టపోయిన రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని అన్ని రకాల పంటలకు నష్టపరిహారం చెల్లించాలని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని పంట కాలువలు మురుగుకాలు ఆధునీకరణ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాను అపార నష్టాన్ని మిగిల్చిందని వరి, సెనగ, పెసర, కంది, మొక్కజొన్న మిరప మినప, పొగాకు, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని చేతికొచ్చిన పంట నీట మునిగి నీరు నిల్వ వుండి పంట ఎందుకు పనికిరాదని రైతులు కన్నీరు మునీరవుతున్నారని అన్నారు. కళ్ళాలోనూ, రోడ్లపైన ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవట్టంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నారన్నాని పడిపోయిన పొలాలను నిలబెట్టి తడవగా మిగిలిన ధాన్యాన్ని కాపాడుకుంటూ తడిసిన ధాన్యాన్ని కొనే దిక్కులేక రైతులు తీవ్రంగా నష్ట పోయారని అన్నారు. ప్రభుత్వం అన్నిరకాల పంటలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలనిడిమాండ్ చేశారు. పొలాల్లో నీరు లాగటానికి పూడుకలు ఆటంకంగా ఉన్న మురుగు డ్రైనేజీలను పంట కాలవలను యుద్ధ ప్రాతిపదికన ఆధునీకరణ పనులు చేపట్టాలని వర్షాలు వల్ల ఉపాధి కోల్పోయిన వృత్తిదారులు వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం నిత్యవసర వస్తువులు నగదును అందజేసి ఆదుకోవాలని అన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ ఆఫీస్ ఏవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, మండల కార్యదర్శి జాలీ రాంమోహన్ రావు, కమిటీ సభ్యులు గూతూల శ్రీ రామచంద్రుడు, గుంపుల మోహన్, గుబ్బల గోపీ, కవురు శ్రీను, పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, పొన్నాడ రాము, నోముల కొండ, బుడిది జోగేశ్వరరావు తదితర రైతులు పాల్గొన్నారు.


























# తిరుమలలో జలదృశ్యం

తిరుమల, డిసెంబర్ 11, :మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో ఏపీ తో సహా అనేక ప్రాంతాల్లో వానలు దంచికొట్టాయి. భారీ వర్షాలు కురవడంతో తిరుమలలో కొండ కోనల్లో వాగులు ఉప్పొంగాయి. దివి నుంచి భువి దిగి వచ్చినట్టు గంగమ్మ పరవళ్లు తొక్కింది. జాలువారే జలధారలతో తిరుమలలో జలదృశ్యం అబ్బురమన్పించింది. అల్లంత ఎత్తు నుంచి దూకిన జలధారలను చూసి భక్తులు పరవశించిపోతున్నారు. ఎడదెరిపిలేని వానలతో తిరుమలలోని ఐదు జలశయాలు నిండు కుండల్లా మారాయి. పాపవినాశనం డ్యామ్ , గోగర్భం ఆకాశగంగ, కుమారధార, పసుపుధార రిజర్వాయర్లలో నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకుందిప్రస్తుతం తిరుమల జలాశయాల్లో భారీగా నీరు చేరడంతో నిండుకుండను తలపిస్తున్నాయి. ఐదుకు ఐదు రిజర్వాయర్లో నీటి మట్టం గరిష్ట స్థాయిలో వుంది. మరో ఏడాది వరకు తిరుమలకు ఇక నీటి ఎద్దడి అనే ప్రసక్తే ఉండదన్నారు టీటీడీ వాటర్ వర్క్స్ అధికారులు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ,అధికారులతో కలిసి తిరుమల జలశయాలను సందర్శించారు. ఇదంత ఏడుకొండల వాడి కరుణా కటాక్షమన్నారాయన.రోజు రోజుకు కొండంత రద్దీ పెరుగుతోంది సరే రానున్న రోజుల్లో తిరుమల అవసరాలకు సరిపడ నీరు ఎలా? అనే అంశంపై ఇటీవలే టీటీడీ బోర్డులో చర్చ జరిగింది. నీటి ఎద్దడిని అధిగమించేలా కండలేరు రిజర్వాయర్ నుంచి తిరుమలకు నీటిని పంపింగ్ చేయాలని సమావేశంలో చర్చించారు. కానీ కాగల కార్యం కలియుగ దైవం అనుగ్రహంతో తీరిందన్నారు భూమాన. నవంబరు 23న ప్రారంభించిన శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ఫలితమే ఈ జలకళ అన్నారాయాన.ఔను.. ఈ నెల 3న కుండపోతగా కురిసిన వానలతో తిరుమల జలాశయాలు ఇలా నిండుకుండల్లా మారాయి. అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్నారు. వరద పెరగడంతో గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేశారు. కండలేరు నుంచి ఎత్తి పోతలు అక్కర్లేదు. ఇప్పుడు నీటి నిల్వలతో ఇక ఏడాది వరకు బేఫికర్. తిరుమలలో నీటి కటకట అనే మాటకు ఆస్కారమే లేదిక అంటున్నారు.

# అభివృద్ధిలో భీమవరంను ఆదర్శంగా చేస్తాం: ప్రభుత్వ విప్ గ్రంధి




భీమవరం, డిసెంబర్ 11 (ప్రజాపాలన ప్రతినిధి) :భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ముందుగా 36వ వార్డు ఎమ్మార్ నగరం నందు 16 లక్షలతో చేపట్ట నున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం 37వ వార్డు యాదవుల వీధిలో 40 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణానికి, 34 వ వార్డులో పళ్ళ వారి వీధిలో 22 లక్షల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆయన శంకు స్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. గత నాలుగున్నరేళ్ళ గా రూ 90 కోట్ల వ్యయంతో పట్టణంలో అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని పట్టణంలో ప్రతి వార్డులోను అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అన్నారు. వంద పడకల ఆసుపత్రి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. యనమదుర్రు డ్రైన్ పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణ నిమిత్తం 36 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని రానున్న 20 రోజుల్లోగా ఈ పనులకు టెండర్లను పిలవడం జరుగుతుందని అన్నారు. ఈనెల 12వ తేదీన భీమవరంలో జరగవలసిన ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పర్యటన వాతావరణ ప్రతికూల పరిస్థితులు వల్ల రద్దయిందని అయితే ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన భీమవరంలో జరిగే అవకాశం ఉందని, ఇక్కడ నుండే జగనన్న విద్యా దీవెన నిధులను మంజూరు చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమాలలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, మున్సిపల్ ఎంఈ త్రినాధరావు, పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, పార్టీ నాయకులు ముదునూరి సుబ్బ రాజు, గొరిపర్తి సత్యనారాయణ, రేవూరి గోగిరాజు, పట్టెం నరసిం హారావు, చింతా ప్రసాద్, చింతా వరలక్ష్మి, పల్లా ఏసుబాబు, మాను కొండ ప్రదీప్, కరిమెరక రామచం ద్రరావు, గన్నాబత్తుల పూర్ణ, కాకూలపాటి రామకృష్ణ, అడబాల దుర్గారావు, కోడె యుగంధర్, గంధం శివ, ముల్లి నరసింహా మూర్తి, వేంద్ర జయరాం, బొర్రా వాసు, గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు, కొల్లి ప్రసాద్, కొప్పర్తి వీర రాఘవులు, నందమూరి ఆంజనేయులు, పతివాడ రాజేంద్ర, గంటా సుందర్ కుమార్, మెట్టా మురళి, తిరుమాని శ్రీను, తిరుమాని రాంబాబు, కోమటి రాంబాబు, నా మన మహేష్, పద్మాలయ రామకృష్ణంరాజు, చెన్ను చంటి, సంకా ముత్యం నాగేశ్వరరావు, మండల నరేంద్ర, పెన్నాడ శ్రీను నాయకులు పాల్గొన్నారు.

## పల్లె పల్లెకు నాలుగో రోజు రితీష్ రెడ్డిపాదయాత్ర



కాశినాయన ప్రజాపాలన ప్రతినిధి:కడప జిల్లా శ్రీ అవధూత కాశి నాయన మండలం ఉప్పులూరు క్యాంపు స్థలం నుండి నరసాపురం మిద్దెల గంగనపల్లె గుంటూరు పల్లె బాలయ్య పల్లె వరికుంట్ల నాయన పల్లి ఆకుల నారాయణ పల్లి వరకు పాదయాత్ర కొనసాగించారు ఈ సందర్భంగా టిడిపి యువ నేత రితీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని వారు అన్నారు 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా తప్పనిసరిగా ఎగురుతుందని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు విజయమ్మ టిడిపి అభ్యర్థి బొజ్జ రోషన్న మండల పార్టీ అధ్యక్షుడు రాజారెడ్డి శ్రీనివాస్ రెడ్డి కృష్ణారెడ్డి పోల్ రెడ్డి కర్నాటి శివారెడ్డి కుమారుడు యువనేత వెంకట్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కడపమాజీ పార్లమెంట్ అధ్యక్షురాలు శ్వేతా రెడ్డి వరి కుంట్ల టిడిపి ఇన్చార్జ్ కొండ నరసింహ రెడ్డి ఈశ్వర్ రెడ్డి భాస్కర్ రెడ్డి మరియు టిడిపి కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొని పాదయాత్రను కొనసాగించారు తదనంతరం ఆకుల నారాయణ పల్లి టిడిపి కార్యకర్తలు పెంచలయ్య నరసింహులు మరియు అందరికీ వచ్చిన వారందరికీ చక్కటి భోజన వసతులు కల్పించడం జరిగింది

## రాష్ట్రానికి మళ్ళీ సీఎం జగన్మోహన్ రెడ్డినే కావాలి



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపినందునే ఏపీకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మరలా అవసరమని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58 వ డివిజన్ 260వ వార్డు సచివాలయ పరిధి ఆంధ్రప్రభ కాలనీలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో సోమవారం డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఘన నివాళులర్పించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ నాయకుడు చేయని విధంగా ఏపీని అన్ని రంగాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభివృద్ధిలో ముందుకు నడిపిస్తున్నారన్నారు. ముఖ్యంగా విద్యా రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని నాణ్యమైన విద్యను అందిస్తూ రేపటి తరాన్ని తీర్చిదిద్దడంలో ముందంజలో ఉందన్నారు. నాడు-నేడు, ఇంగ్లీష్ మీడియం, విద్యాకానుక, అమ్మఒడి, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన లాంటి కార్యక్రమాలతో విద్యారంగంలో ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. అలాగే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 25 లక్షల వరకూ ఉచిత వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భరోసా ఇస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలా నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని తెలియచెప్పేందుకు వై ఏపీ నీడ్స్ కార్యక్రమం ద్వారా ప్రజల ముందుకు వచ్చినట్లు మల్లాది విష్ణు పేర్కొన్నారు. 260 సచివాలయ పరిధిలో డిబిటీ ద్వారా ఇప్పటివరకు 5 కోట్ల 39 లక్షల 79 వేల 905 రూపాయల లబ్ధి చేకూర్చగా నాన్ డీబీటీ ద్వారా 3 కోట్ల 49 లక్షల 98 వేల 873 రూపాయల మేలు చేకూర్చడం జరిగిందన్నారు. మొత్తంగా రూ. 8.89 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. ఇటువంటి ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లోనూ నిండు మనస్సుతో ఆశీర్వదిస్తే.. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏసీపీ మోహన్ బాబు, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, రఫీ, శనగశెట్టి హరిబాబు, యక్కల మారుతి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ జన్మ దిన శుభాకాంక్షలు తెలిపిన తాండ్ర సాంబశివరావు



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 11: బాపట్ల పట్టణం కాపు కళ్యాణ మండపం లో జరిగిన మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ జన్మ దిన వేడుకలలో పాల్గొని శుభాకాంక్షలు తెలియ జేస్తూన్న బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు మరియు ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో సీనియర్ మాజీ సైనికులు సుంకర శేషగిరి రావు, తోట దుర్గా రావు, %జష్ట్రజ% కృష్ణా రావు, పసుపులేటి ప్రసాద్, టి రుఖమదరావు మొదలగు వారు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా సోమవారం మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ జన్మదిన వేడుకలు



బాపట్ల జిల్లా ప్రజపాలన డిసెంబర్ 11: బాపట్ల నియోజకవర్గ పరిధిలోని నందలి వివిధ కూడలిలో, సతీష్ ఫుడ్ పార్క్, దమ్మనవారిపాలెం మరియు అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణ మండపం నందు అభిమానులు, శ్రెయుభిలాషుల మధ్య కోలాహలంగా జరిగాయి..ఈ కార్యక్రమము నకు ముఖ్యఅతిధులు గా ఢిల్లీ లో ఆంద్రప్రదేశ్ భాజపా కో ఆర్డినటర్ పూరిగళ్ళ రఘురాం భాజపా మాజీ జాతీయ కార్యదర్శి రామేశ్వర ప్రసాద్ చౌరాసియా బీహార్, మాజీ ఎమ్మెల్యే మంతెన ఆనంతవర్మ మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశ రావు , కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి. శ్రీనివాసరావు మరియు కార్యవర్గ సభ్యులు... అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.

## జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



పామర్రు ప్రజాపాలన ప్రతినిధి : తోట్లవల్లూరు(మ) రొయ్యూరు గ్రామం పంట నష్టపోయిన అరటి, తమలపాకు రైతులను పరామర్శించిన కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అరటి రైతులు ఎకరానికి రూ.50 వేలకు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు, తమలపాకు రైతులకు ఒక ఎకరాకు మూడు లక్షల చొప్పున ఖర్చు అయ్యింది .ప్రభుత్వం ఈ తుఫాను ను జాతీయ విపత్తుగా ప్రకటించాలి ముఖ్యమంత్రికి వ్యవసాయంపై అవగాహన లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదు.ముఖ్యమంత్రి పర్యటన తీరు బాధాకరంగా ఉంటుంది . ముఖ్యమంత్రి పంటల విషయంలో ఎన్ని ఎకరాలు రైతులు సాగు చేశారు, ఎంత నష్టపోయారు అని గుర్తించే బాధ్యతను కలెక్టర్లకు అప్పగించాలి. అరటి పంట నష్టపోయిన రైతులకు ?1,50,000, తమలపాకు రైతులకు మూడు లక్షలు, వరి రైతులకు రూ.50,000లు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని గిడుగు అన్నారు.ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రూ 25 లక్షల ప్రకటించాలని డిమాండ్ చేశారు.1989లో మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రపంచ బ్యాంకు నుంచి నిధులు తీసుకొచ్చి డ్రైనేజ్ మరమ్మతులు చేయించారు.పంట పొలాలు ఎంత ముఖ్యమో మురుగు నీరు బయటకు పోవడం కూడా అంతే ముఖ్యం. వంద రోజుల్లో ఈ రాష్ట్రంలో పెను మార్పు రాబోతుందని కర్ణాటకలో, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన రీతిగానే ఇక్కడ జనరంజికమైన పాలన అందించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతుంది అని గిడుగు రుద్రరాజు అన్నారు.

## యువతకు మంచి కార్యక్రమం ఆడుదాం ఆంధ్ర



నరసాపురం, డిసెంబర్ 11 (ప్రజాపాలన ప్రతినిధి) :ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర యువతకు మంచి కార్యక్రమమని యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా మంచి ఆరోగ్యం, మానసిక ఉల్లాసము, ఆలోచన శక్తి కలుగుతాయని యర్రంశెట్టి వారి పాలెం గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ అన్నారు. సోమవారం నరసాపురం మండలం యర్రంశెట్టి వారిపాలెం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాగ ముత్యమాంబ యువతని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైసిపి మండల యువత అధ్యక్షుని చేతుల మీదుగా యువతకు వాలీబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్ కిట్లను యువతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి త్రినాధ వెంకట నరసింహారావు (బాబులు), గ్రామ యువత అధ్యక్షుడు పెట్టా రామారావు, మైలాబత్తుల శ్రీనివాస్, మండల వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్, పులపర్తి ప్రతాప్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## పీ.ఏ.సి.యస్. గోడౌన్ ను ప్రారంభించిన కేడీసీసీబీ చైర్మన్ తాతినేని పద్మావతి, ఎమ్మెల్యే జగన్ మోహన్



కంచికచర్ల డిసెంబర్ 11 ప్రజా పాలన ప్రతినిధి మండ లంలోని పరిటాల గ్రామంలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసా య సహకార పరపతి సంఘం లి" యొక్క గోడౌన్ ను కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతితో కలిసి శాసనసభ్యులు డాక్టర్ మొండి తోక జగన్ మోహన్ రావు సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరైతుసంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కృతనిశ్చయంతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. రైతులకు సేవలందించే సహకార సంఘాల బలోపేతా నికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనంవిక్రయం నుంచి పంటల కొనుగోలు వరకు ఆర్.బి.కే. ల ద్వారా రైతులను ఆదుకుంటున్న సీఎం జగన్ ను రైతులు, ప్ర జలు ఆశీర్వదిస్తున్నారని అన్నారు. రైతుల ఆర్థిక స్వా లంబన కోసం సీఎం జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. రైతులు పండించిన పంటను నిలువ చేసుకోవడానికి నిర్మించిన గోదామును ఉపయోగించుకోవాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుత సర్కా రు రైతుల అభ్యున్నతికి తోడ్పాటునందిస్తున్నారని కొనియాడారు. అనంతరం కేడీసీసీబీ చైర్మన్ తాతినేని పద్మావతి గారిని శాలువాతో సత్కరించారు ఈ కార్య క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయ స్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొ న్నారు


## పల్లె పల్లె లో పర్యటిస్తా.. దర్బార్ నిర్వహిస్తా..

### తెలుగుదేశం పార్టీ యువనేతరితీష్ కుమార్ రెడ్డి



బద్వేల్ ప్రజా పాలన ప్రతినిధి: బద్వేల్ నియోజకవర్గంలోని ప్రతి పల్లెను సందర్శించి ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసమే పాదయాత్ర చేపట్టినట్టు, బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు రితీష్ కుమార్ రెడ్డి అన్నారు. పాదయాత్రలో భాగంగా నియోజకవర్గంలోని కాశినాయన మండలం వరికుంట్ల లో పర్యటిస్తున్న సందర్భంగా రైతుల సమస్యలన్నీ తీర్చుకోవడం కోసమే రోజుకు వర్గంలోని ప్రతి పల్లెకు పర్యటిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. పేదలకు దళితులకుసంక్షేమ పథకాలు అందేలా చేయడమే తెలుగుదేశం పార్టీ ప్రధాన కర్తవని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ. నియోజకవర్గం ఇంచార్జ్ కే. విజయమ్మ, టీడీపీ అభ్యర్థి రోశన్న, వరికుంట్ల టిడిపి ఇంచార్జ్ కొండ నరసింహారెడ్డి కొండఈశ్వర్ రెడ్డి బసిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజరెడ్డి, సీతా వెంకటసుబ్బయ్య, గురివి రెడ్డి, రామచంద్రయ్య కార్యకర్తలు బొజ్జచిన్న దాసరిపల్లి కమలాపురం ప్రభాకర్రా బొజ్జ గోపన్న రాజగోపాల్ మరియు కార్యకర్తలు వేల సంఖ్యలో పాల్గొనడం జరిగింది

# ఫిబ్రవరిలో ఎన్నికలు..!



విజయవాడ, డిసెంబర్ 11, : సార్వత్రిక ఎన్నికలు ఒక నెల ముందే ఎన్నికలు పెట్టే ఆలోచనలో కేంద్ర ఎన్నికల సంఘం ఉందని.. దీనికి బీజేపీ మద్దతు కూడా ఉందని జోరుగా ప్రచారం ప్రారంభమయింది. ఇలా పెట్టే అవకాశం ఉందని చెప్పుకోవడానికి రాజకీయ పరమైన , నిర్వహణ పరమైన కారణాలు స్పష్టంగా కనిపిస్తూనే ఉన్నాయి. అందుకే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కూడా ఎన్నికలు ఏప్రిల్ లో ఉంటాయని రిలాక్స్ అవవమాకండని.. ఫిబ్రవరిలోనే ఉండవచ్చని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల కోసం దాదాపుగా పూర్తి చేసింది. రిటర్నింగ్ ఆఫీసర్లను నియామకం దగ్గర్నుంచి ఈవీఎంలను నియోజకవర్గాలకు చేర్చడం వరకూ అన్ని పూర్తయిపోయాయి. పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిషా వంటి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలుకూడా జరగాల్సి ఉంది. వాటికీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక ఎన్నికల నిర్వహణకు చివరి సన్నాహం అయిన ఓటర్ల జాబితాను అప్ డేట్ చేసే ప్రక్రియ కూడా ఊపందుకుంది. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, ఓటర్ల ఫొటోల మార్పుల కోసం ఈ నెల 20 నుంచి జనవరి 5 వరకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 2024 జనవరి 6న ముసాయిదా ఓటర్ల జాబితా, జనవరి 8న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నారు. 2024 జనవరి ఒకటో తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం వెల్లడించింది. అంటే జనవరి మొదటి వారం కల్లా పూర్తి స్థాయిలో ఓటర్ జాబితాలు రెడీ అయిపోతాయన్నమాట. ఇక ఎన్నికల సన్నాహాలు పూర్తయినట్లే. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడానికి రెడీగా ఉన్నట్లే. సాధారణంగా 2019 సార్వత్రిక ఎన్నికలకు మార్చి పదో తేదీన షెడ్యూల్ విడుదల అయింది. మొత్తంగా ఎనిమిది విడతల్లో పోలింగ్ జరిగింది. జూన్ లో కౌంటింగ్ జరిగింది. ఇంత సుదీర్ఘమైన ప్రక్రియపై విమర్శలు వచ్చాయి. అందుకే ఈ సారి ఎన్నికల సంఘం.. నాలుగైదు విడతల్లోనే పూర్తి చేయాలని అనుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనికి బీజేపీ కూడా అనుకూలంగానే ఉందంటున్నారు. బీజేపీ ఇప్పుడు జోష్ మీద ఉంది. మూడు హిందీ రాష్ట్రాల్లో విజయంతో హిందీ బెల్ట్ లో తిరుగులేదని మరోసారి నిరూపతమయిందని.. ఆ వేడి తగ్గక ముందే ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందా అని బీజేపీ పెద్దలు ఆలోచిస్తున్నారని అంటున్నారు. రాజకీయ పరంగా ఫిబ్రవరిలో షెడ్యూల్ రీలీజ్ చేసి .. రెండు నెలల్లో ప్రక్రియ పూర్తి చేస్తే ఎక్కువ కాలం ఎన్నికలను సాగదీసిన్టలుగా ఉండదన్న అభిప్రాయంతో ఉన్నారంటున్నారు. బీజేపీ పెద్దలు ఈ విషయంలో సీరియస్ గా ఆలోచిస్తున్నారని కూడా ఢిల్లీ వర్గాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరిలోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసి.. మార్చి లేదా ఎప్రిల్ నాటికి పూర్తి చేయడానికి పాలనా పరమైన కొన్ని ప్లస్ పాయింట్స్ కూడా ఉన్నాయని చెబుతున్నారు. ఫిబ్రవరిలో ప్రారంభిస్తే.. ఎండలు ముదిరే అవకాశం ఉండదు. అదే సమయంలో వివిధ రకాల పరీక్షలకు ముందే ప్రక్రియ పూర్తయిపోతుంది. అదే మార్చిలో షెడ్యూల్ ఇస్తే.. పరీక్షలు కూడా ఎఫెక్ట అవుతాయి సాధారణంగా దక్షిణాదిలో మొదటి విడతలోనే ఎన్నికలు పెట్టేస్తారు. గత ఎన్నికల్లో మొదటి విడతలోనే ఎన్నికలు జరిగాయి. మార్చి పదోతేదీన ఎన్నికల షెడ్యూల్ వస్తే ఏప్రిల్ మొదటి వారంకల్లా పోలింగ్ పూర్తయిపోయింది. కౌంటింగ్ కోసం రెండు నెలలు ఆగాల్సి వచ్చింది. అందుకే?.. పిబ్రవరి?ల పెడితే.. ఓ వైపు ఎండల నుంచి రక్షణ.. మరో వైపు విద్యార్థుల పరీక్షలకు ఇబ్బంది లేకుండా పనిపూర్తి చేయవచ్చని అనుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు ఫిబ్రవరి ఎన్నికలకే రెడీ అవుతున్నాయి. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఇప్పుడే ముగిశాయి. గెలిచిన పార్టీకి కాస్త అడ్వాంటేజ్ ఉంటుంది. అసెంబ్లీ టిక్కెట్ల ఖరారు సమయంలోనే పార్లమెంట్ అభ్యర్థుల్ని దాదాపుగా ఖరారు చేసుకున్నారు. పైగా అధికారంలో ఉంది కాబట్టి.,. సన్నాహాలు మామూలుగానే ఉంటాయి. ఇక బీఆర్ఎస్, బీజేపీ కూడా ఎక్కువ ఆలస్యం ఉండకూడదని.. ఎంత తొందరగా పూర్తయిపోతే అంత మంచిదని అనుకుంటున్నాయి. ఇక ఏపీలో ఎన్నికలపై .. టీడీపీ, జనసేన కూటమి పూర్తిగా సిద్ధమయింది. జగన్మోహన్ రెడ్డి కూడా వైసీపీని సిద్ధం చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక కసరత్తును కూడా ఓ కొలిక్కి తెచ్చారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఫిబ్రవరిలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చినా అన్ని పార్టీలు రెడీగా ఉన్నట్లే.

## గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు



నందిగామ డిసెంబర్ 11 ప్రజాపాలన ప్రతినిధి పట్టణ పరిధిలో 18 వ వార్డులో గడపగడపకు మన ప్రభుతో కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారుఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ జగనన్న పదవీ బాధ్యతలు చేపట్టిన ప్పటి నుంచి జగనన్న చెప్పాడంటే.. చేస్తాడంటే నమ్మకం ప్రజల్లో గట్టిగా ఉందన్నారు. ప్రతి ఒక్కరికి మం చి జరగాలనే దృఢ నిబద్ధతతో చేస్తున్న పరిపాలన వి ధానం ఆయన విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. జగనన్న దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభి వృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్క రికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల మద్దతుగా జ గనన్న నిలిచారన్నారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవే ర్చడం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, పాలనా వికేంద్రీకరణ, పటిష్టమైన సామాజిక భద్రత, సమర్ధ వంతమైన సేవా బట్వాడా, నిష్పక్షపాత సంక్షేమ చర్య లు, మహిళా సాధికారత మరియు బి. సిలు, ఎస్. సి లు, ఎస్టీలు మరియు మైనారిటీల చేరికను పెంపొం దించడం వంటి పలు కీలక ప్రమాణాలపై జగనన్న పా లనకు గీటురాయిగా నిలిచాయన్నారు. జగనన్న నా లుగున్నర సంవత్సరాల పాలనలో ఉత్తమంగా ప్రజ లకు సేవలు అందించారని కొనియాడారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ జగనన్న సంక్షేమ పాలనకు అం డగా ఉండి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజల్ని కోరా రు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు,కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్చార్జిలు, వైయస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలం టీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రబీ సాగుకు ఎదురు దెబ్బ..


ఏలూరు, డిసెంబర్ 11, : ఖరీఫ్ మాసూళ్లు ఎప్పటికీ పూర్తయ్యేనో.. దాళ్వా నారుమడులు పూర్తయ్యేదెప్పుడో.. ఇంకా పొలాల్లో ఉన్న 60 శాతం పంట గట్టెక్కేదెప్పుడో.. నాట్లు ఆలస్యమైతే దాళ్వా సాగు సాగేనా.. ఇలా రైతులను అనేక ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మిచౌంగ్ తుపాను దెబ్బకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు దాళ్వాసాగుపై తీవ్ర ప్రభావం చూపనుండటంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాళ్వా సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న జిల్లా రైతాంగం ఆశలను మిచౌంగ్ తుపాను తుడిచేసింది. ఖరీఫ్ పంట మాసూళ్లు పూర్తిచేసి దాళ్వా నారుమడులు వేసేందుకు తీవ్ర ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది. దీంతో ఇటు ఖరీఫ్ పంట పోయే.. అటు దాళ్వా పంట ఏమవుతుందో తెలియని పరిస్థితుల్లో అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు. తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో రైతులు తడిసిన ధాన్యం ఆరబెట్టడంలోనే రోజులు గడిచిపోతున్నాయి. దీంతో రబీ నారుమడులపై దృష్టి సారించే పరిస్థితి లేకుండాపోయింది. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో వరిసాగు సాగింది. ఏలూరు జిల్లాలో 45 శాతం మాసూళ్లు పూర్తవ్వగా, పశ్చిమ గోదావరి జిల్లాలో 35 శాతం మాసూళ్లు మాత్రమే పూర్తయ్యాయి. సరాసరిన 40 శాతం మాసూళ్లు పూర్తవ్వగా, దాదాపు 2.50 లక్షల ఎకరాల్లో పంటంతా పొలాల్లోనే ఉంది. మిచౌంగ్ తుపాను భీభత్సంతో రైతుల బతుకులు అల్లకల్లోలంగా మారాయి. తుపాను ప్రభావంతో రెండు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పొలాల్లో మోకాళ్ల లోతుకుపైగా వరదనీరు నిలిచిపోయింది. దీంతో మాసూలు చేసిన రాశులన్నీ నీట మునిగాయి. కోత కోయాల్సిన పొలాలు నేల కొరిగి నీటిలో నాని కుళ్లిపోతున్న పరిస్థితి నెలకొంది. రబీలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4.60 లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో నిర్ణయించారు. సకాలంలో రబీ నాట్లు పూర్తి కావాలంటే డిసెంబర్ 15వ తేదీకి రబీ నారుమడులు పూర్తి చేయాలని తెలిపారు. ఇప్పట్లో రైతులు నారుమడులు వేసే పరిస్థితి లేకుండాపోయింది. అందుకు ప్రధాన కారణం ప్రభుత్వమేనని చెప్పాలి. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులు వేగంగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేసేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం మాత్రం మాటలకే పరిమితమై రైతులను వంచిస్తోంది. పొలాల్లో నీరు తగ్గి ఖరీఫ్ మాసూళ్లు పూర్తి చేయాలంటే మరో 20 రోజులకుపైగా సమయం పట్టే పరిస్థితి ఉంది. అంటే డిసెంబర్ నెలాఖరుకు కూడా నారుమడులు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు. నిడమర్రు, ఉంగుటూరు వంటి పలు మండలాల్లో కొల్లేరుకు ఆనుకుని ఉన్న పొలాలకు రైతులు నారుమడులు వేశారు. తుపాను దెబ్బకు పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో నారుమడులు పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత పరిస్థితి చూస్తే దాళ్వా నాట్లు ఫిబ్రవరి వరకూ పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. అదే జరిగితే సాగునీటి సమస్య ఏవిధంగా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. ఇది రబీ పంటపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీంతో ఇటు ఖరీఫ్, అటు రబీలోనూ రైతులు నష్టాలు పాలైతే అప్పుల ఊబిలో కూరుకుపోతారు. ఖరీఫ్ మాసూళ్లు త్వరగా పూర్తికావాలంటే ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలి. అయితే ప్రభుత్వం అటువైపు ఏమాత్రం ఆలోచించని పరిస్థితి. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తేనే సకాలంలో దాళ్వా సాగు వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎక్కడా జరగడం లేదు. అందుకు సంబంధించి ఎటువంటి ఆదేశాలనూ ప్రభుత్వం విడుదల చేయలేదు. తేమ శాతానికి సొమ్ము కటింగ్ చేసే విధానమే కొనసాగుతోంది. దీంతో తడిసిన ధాన్యం రోడ్లపైనే దర్శనమిస్తోంది. కోతల మీద ఉన్న పొలాలు మాసూళ్లు త్వరగా పూర్తి కావాలంటే ధాన్యం కొనుగోలులో తేమశాతం నిబంధన సడలించి తడిసిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. అప్పుడు వేగంగా ఖరీఫ్ మాసూళ్లు పూర్తయ్యి దాళ్వా నారుమడులు వేసేందుకు రైతులకు అవకాశం ఉంటుంది. ఇదేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే దాళ్వా సాగులోనూ రైతులకు ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఏపీలో బీఆర్ఎస్ ఫ్యూచర్ ఏంటీ..?

విజయవాడ, డిసెంబర్ 11, :ఏపీ బీఆర్ఎస్ నేతల పరిస్థితి ఏంటి? కొద్ది నెలల కిందట పార్టీ అంటూ హడావిడి చేశారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో ఏపీలో పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏపీలో ప్రధాన సామాజిక వర్గాలను టార్గెట్ చేసుకుంటూ.. పార్టీని విస్తరించాలని కేసీఆర్ భావించారు. అందుకు తగ్గట్టుగానే కొందరు మాజీ ఐఏఎస్అధికారులు పార్టీలో చేరారు. హైదరాబాద్ వేదికగా కీలక సమావేశాలు నిర్వహించారు. అయితే తాజాగా బీఆర్ఎస్ ఓటమితో ఆ నేతలంతా నైరాశ్యంలో మునిగిపోయారు. తెలంగాణ రాష్ట్ర సమితిగా ఉన్న తన పార్టీని భారత రాష్ట్ర సమితిగా కేసీఆర్ మార్చారు. ఏపీ తో పాటు ఒడిశా, మహారాష్ట్రలో పార్టీని విస్తరించాలని చూశారు. కొంతమంది నేతలను సైతం పార్టీలో చేర్చుకున్నారు. ఒడిశాలో అయితే మాజీ సీఎం గిరిధర్ గోమాంగో లాంటి నేతలను చేర్చుకొని పార్టీని విస్తరించాలని భావించారు. అయితే ఎందుకో అనుకున్నంత స్థాయిలో విస్తరించలేకపోయారు. ఇప్పుడు తెలంగాణలో ఓటమితో జాతీయ పార్టీగా విస్తరణ సాధ్యమేనా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏపీలో జగన్ మిత్రుడు గా ఉన్నారు. చంద్రబాబుతో ఒక రకమైన సంవాదాన్ని పెంచుకున్నారు. ఇటువంటి తరుణంలో జగన్ కు మేలు చేయడం, జాతీయ పార్టీగా విస్తరించాలన్న ధ్యేయంతో ఏపీలో బీఆర్ఎస్ కార్యవర్గంతో పాటు కార్యాలయాన్ని సైతం ప్రారంభించారు. ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా తోట చంద్రశేఖర్ ను నియమించారు. మాజీ మంత్రి రావెల కిషోర్ బాబు, పార్థసారథి వంటి నేతలు సైతం బీఆర్ఎస్ లో చేరారు. కాపు సామాజిక వర్గంతో పాటు వెలమ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసిబలం పెంచుకోవాలని ఆలోచన చేశారు. అది అంతిమంగా జగన్ కు ప్రయోజనం చేకూర్చుతుందని.. టిడిపి, జనసేన లకు నష్టం చేకూర్చుతుందని భావించి.. చాలా రకాల ప్రయత్నాలు చేశారు. ముఖ్యంగా జనసేన నేతలను టార్గెట్ చేసుకొని పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడు తెలంగాణ ఓటమితో సీన్ మారింది. ఏపీలో దూకుడుగా పార్టీని ముందుకు తీసుకెళ్తారని భావించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి సానుకూలంగా లేదు. బీఆర్ఎస్ ఏర్పాటు సందర్భంగా విశాఖలో కానీ.. విజయవాడలో కానీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అటు మహారాష్ట్రలో సైతం కెసిఆర్ సభలు నిర్వహించారు. ఇంతలో తెలంగాణ ఎన్నికలు వచ్చాయి. బీఆర్ఎస్ కు ఓటమి తప్పలేదు. దీంతో తెలంగాణ రాజకీయాలపైనే కెసిఆర్ దృష్టి సారించాల్సిన అవసరం వచ్చింది. జాతీయ పార్టీ విస్తరణ అనేది అంత సాధ్యమయ్యే పని కాదని? ఆ భావజాలం నుంచి తప్పుకుంటేనే కెసిఆర్ తెలంగాణలో పార్టీని నిలబెట్టగలరన్న విశ్లేషణలు ప్రారంభమయ్యాయి. అలా చేస్తేనే జాతీయ పార్టీలు సైతం మద్దతు తెలిపే అవకాశం ఉంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## కష్టంలో ఉన్న అన్నదాతను ఆదుకోండి మహాప్రభు..

### తాసిల్దార్ శ్రీనివాస్ కి వినతి పత్రం అందించిన తంటికొండ అన్నదాతలు



గోకవరం:మిచౌంగ్ తుఫాను వల్ల రైతు నిండా మునిగాడని కష్టాల్లో ఉన్న రైతును ఆదుకోవాలని గోకవరం తాసిల్దార్ కి వినతిపత్రం సమర్పించిన తంటికొండ రైతులు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తుఫాను వల్ల పంట పూర్తిగా మునిగిపోయిందని . అధికారులు ఆన్ లైన్ ద్వారానే ధాన్యం కొనుగోలు చేస్తామని షరతులు పెడుతున్నారని,ఈ విధానంతో కాలహరణ జరుగుతుందని,తద్వారా తడిసిన ధాన్యపు గింజలు మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఆన్లైన్ విధానం ప్రక్కన పెట్టి తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. తుఫాన్ వచ్చి రోజులు గడుస్తున్నా వ్యవసాయ అధికారులు మాత్రం పంట నష్టం నివేదిక తెలపలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తేమశాతం పేరుతో రైతు దోపిడీకి గురవుతున్నాడని, ఏదో ఒక సాకు చూపి రైస్ మిల్లర్స్ ధాన్యం బస్తాలతో వెళ్లిన లారీలను వెనక్కు పంపిస్తున్నారని స్థానిక తాసిల్దార్ దృష్టికి తీసుకువచ్చిన అన్నదాతలు పంట నష్ట అంచనాలో వ్యవసాయ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవరిస్తున్నారని అన్నదాతలు తెలిపారు.

# వామ్మో... ట్రాఫిక్

కాకినాడ, డిసెంబర్ 11, :అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ట్రాఫిక్ కష్టాలపై వాహనదారులు మండిపడుతున్నారు. జిల్లా ప్రధానకేంద్రం అమలాపురంలో పలు షాపింగ్ మాల్స్ ప్రారంభం కావడంతో రోడ్లపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నా మాల్స్ నిర్వాహకులు ఏ మాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం హైస్కూల్ సెంటర్ లో ట్రాఫిక్ భారీగా నిలిచిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. షాపింగ్ మాల్స్ ప్రధాన రోడ్డును ఆనుకుని ఉండటంతో రోడ్డుపైన పార్కింగ్ చేస్తున్నారు వినియోగదారులు. ఈ రహదారిలో ప్రధాన ఆసుపత్రులు ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్ వాహనాలు సైతం ట్రాఫిక్ లో ఇరుక్కుపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ సిబ్బందితోపాటు పోలీసులు దగ్గరుండి ట్రాఫిక్ ను నియంత్రిస్తున్న అరికట్టలేని విధంగా ఉంది. దీంతో పోలీసులపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరైన పార్కింగ్ సదుపాయం లేనిచోట్ల షాపింగ్ మాల్స్ కు అనుమతులు ఇవ్వడం ఎందకని ఫైర్ అవుతున్నారు. ట్రాఫిక్ కష్టాలను చూసి అమలాపురం పట్టణం రావాలంటే జిల్లా వాసులు భయపడుతున్నారు. అమలాపురానికి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వస్తున్నాయని ఆనందపడాలా? లేక.. కనీసం బైక్ పై కూడా వెల్లలేని పరిస్థితి ఏర్పడిందని విచారణ చెందాలా? అంటూ వాపోతున్నారు జిల్లా ప్రజలు

